ప్రజాశక్తి

సోపతి

సెప్టెంబర్ 28, 2014 ఆదివారం అనుబంధం

అలుపెరగని పోరుగీతం

వెండి వెలుగుల జీవన చిత్రాలు

- కొత్త సీరియల్ ప్రేమ -విప్లవం
- బి.వి.ఎస్. స్వామి కథ
- ఆశారాజు, చిత్తలూరి సత్యనారాయణ కవితలు

నిలిచి వెలిగే రసజ్ఞత

కళాకారుడు ఎంత విలాసంగా బతికాడని కాదు, ఆ కళ ఎంతకాలం నిలిచివుంటుందన్నది ముఖ్యం. సుప్రసిద్ధ చిత్రకారుడు టిజియానో వెసిల్లియో బొమ్మలు చూస్తే ఈ మాట అనిపిస్తుంది. ఆయన 1488–90 మధ్యన జన్మించారు. 27 ఆగస్టు 1576లో ఈ లోకం నుంచి నిష్క్రమించారు. దాదాపు 86 ఏళ్ళ కాలం సృజనాత్మకంగా జీవించారు. సాంస్కృతిక పునరుజ్జీవన కాలాన ఇటలీలోని ఫ్లారెన్స్, రోమ్ నగరాల్లో చిత్రకళా రంగం ఒక వెలుగు వెలిగింది. ఆ వెలుగుల్ని పరచిన వారిలో ఒక ఉదాత్త చిత్రకారుడు టిజియానో వెసిల్లియో. టిషియన్ అని అందరూ ముద్దుగా పిలుచుకుంటారు. చిత్రకళా రంగంలో అనేక ప్రయోగాలు చేశారు. ఇతని చిత్రాల్లోని వర్ణమిశ్రమాల సోయగం అబ్బురపరుస్తుంది. చిక్కటి రంగుల్నీ, చీకటి వెలుగుల్నీ బలంగా వాడుకున్న చిత్రకారుడు టిషియన్. మానవ దేహంలోని సౌందర్యాన్ని అత్యద్భుతంగా చిత్రించిన సృజనశీలి. స్త్రీ పురుషుల మేని సోయగంలోని వైశిష్ట్యాన్ని ఆయన చిత్రాలు చూపుతాయి. నగ్నత్వం ప్రదర్శించడం ఆయన బొమ్మల ఉద్దేశం కాదు. మానవ దేహం ఒక అద్భుతమన్న భావనని ఆయన చిత్రాలు ప్రోది చేస్తాయి. పురుషుల దేహదారుఢ్యం, స్త్రీలలో కనిపించే లావణ్యం జీవకళతో టిషియన్ చిత్రాల్లో ప్రతిఫలిస్తాయి. ఆ కాలపు మత, రాజ్య, ధర్మ, సామాజిక, సాంస్కృతిక రంగాలకు సంబంధించిన అంశాలెన్నో ఆయన చిత్రాలకు ఇతివృత్తాలయ్యాయి. ప్రతి చిత్రమూ అజరామరమైన కళాఖండం. కనుకనే చిత్రకారుని జీవితం కన్నా అతని కళాప్రతిభనే శతాబ్దాలు గడిచినా నిలిచివుంటుంది. ఈ అంశాన్ని మనకాలపు చిత్రకారులు గుర్తించగలిగితే మంచిది.

■ అంతరంగం

మానవ కర్తవ్యం

జీవితం అంటే ఏమిటి? అని బుచ్చిబాబు నవల 'చివరకు మిగిలేది'లో కథానాయకుడు దయానిధి తీవ్రంగా మథనపడతాడు. చదువుకునే రోజుల్లోనే తన మాస్టారును ఈ ప్రశ్న అడుగుతాడు. యవ్వనప్రాయంలో వున్న మనిషి ఈ ప్రశ్న అడగటమంటే ఏదో ప్రమాదం పొంచివుందనిపిస్తుంది ఆ మాస్టారుకు. చివరకు ఓ రోజు దయానిధికి ఒక కవర్ ఇచ్చి తాను వెళ్ళిపోయాక ఆ కవర్‌ను విప్పి చూస్తే, అతని ప్రశ్నకు సమాధానం దొరుకుతుందని చెబుతాడు. కొన్నేళ్ళకు ఆ మాస్టారు నిష్క్రమణ అనంతరం దయానిధి కవర్ విప్పుతాడు. అందులో ఒక ఖాళీ కాగితం కనిపిస్తుంది. అప్పటిదాకా అనేక అనుభవాలతో తల్లడిల్లే దయానిధి, ఆ కాగితం చూసి నిస్పృహకు లోనవుతాడు. జీవితానికి అర్థమే లేదా అని తలపోస్తాడు. ఈ నవల చదివిన చాలామంది కవర్‌లో ఖాళీ కాగితం చూసి విస్తుపోతారు. ఎందుకంటే యవ్వనప్రాయంలో ఆ నవల చదివిన చాలామంది యువకులు దయానిధి పాత్రలో లీనం అవుతారు. జీవితం అంటే ఏమిటని, జీవితానికి అర్థం ఏమిటని అన్వేషిస్తారు. నిజానికి మనిషి జీవితానికి ఒక ఉద్దేశమంటూ లేదని ప్రకృతి తత్వవేత్త మసనోబు ఫుకుఓకా చెబుతారు. జీవితానికి ఉద్దేశమంటూ ఊహించుకోనవసరం లేదు. దానికోసం వెతకనవసరం లేదన్నది ఆయన తత్వం.

కానీ వ్యక్తిత్వవికాస గ్రంథాలు, జీవించడం ఎలానో నేర్పుతామనే నిపుణులు మనకు ఈ కాలాన చాలామంది బయలుదేరారు. జీవితానికి కొన్ని లక్ష్యాలు, ఉద్దేశాలు ఆపాదించి కొన్ని నమూనాల్ని మన ముందు వుంచుతున్నారు. అందుకే జీవితం అంటే ఏమిటో, ఎలా జీవించాలో అయోమయానికి లోనవుతుందీ తరం. గెలుపు ఓటముల చింతన పెరిగింది. ఎవరిమీద ఎవరికి విజయం, దేనికీ విజయం అన్న అంశాలపై అవగాహన లోపించింది.

కాలం ఒక ప్రవాహం లాంటిది. మనుషులు పుడతారు. జీవిస్తారు. కొన్నాళ్ళకు వెళ్ళిపోతారు. ఆ జీవితానికి లక్ష్యాలు, ఉద్దేశాలు ఉండి తీరాలా? ఉద్దేశం లేనంతమాత్రాన జీవితం అర్థరహితమేమీ కాదు. జీవించినంత కాలం ఇతరులకు తక్కువ కీడు, ఎక్కువ మేలు జరిగేలా నడుచుకోవాలి. పరుల నెత్తిగొట్టి బతకడం కూడదన్న గ్రహింపు ఉండాలి. ఇతరుల శ్రమశక్తిని కొల్లగొట్టి విలాసంగా గడపకూడదన్న ఎరుక మంచిది.

శతాబ్దాల మానవ ప్రయాణంలో తారతమ్యాలు ఏర్పడ్డాయి. రెక్కలకష్టమ్మీద బతికే మనుషుల్ని చిన్నచూపు చూడటం కొందరికి అలవడింది. తెలివితేటల పేరిట, ప్రతిభ పేరిట శరీరశ్రమను తక్కువగా చూసే ధోరణి నెలకొన్నది. కానీ చెమట చిందించే వారు లేకపోతే మిగతా మానవ ప్రపంచం సౌఖ్యంగా ఉండగలదా? అవనిపై ప్రతి మనిషి జీవితం విలువైనదే. ప్రత్యేకమైనదే. గెలుపు ఓటములతో సంబంధం లేకుండా మనుషులు ఈ లోకంలో జీవితం మరింత సౌకర్యవంతంగా ఉండేందుకు పనిచేస్తున్నారని బోధపడుతుంది. ఈ ఎరుకతో సాటివారి పట్ల దయతో వ్యవహరించడమే మనుషుల కర్తవ్యం. అదే జీవితానికి అర్థం, పరమార్థం.

వెంటాడే వాక్యం
ప్రకృతి న్యాయం ప్రకారం ఒక తలుపు మూసుకుంటే మరో తలుపు తెరుచుకుంటుంది.
– థామస్ అబ్రహం

ప్రజాశక్తి
సోపతి
సెప్టెంబర్ 28, 2014

లేఖలు	4
సంగీతం లేత స్వప్నాల గీతలహరి	5
కవర్‌స్టోరీ	
వెండి వెలుగుల జీవన చిత్రాలు	6
కథ మార్పు	10
అలనాటి పత్రిక	
ఓరుగల్లు విశిష్ట సాహిత్య పత్రికలు	12
స్ఫూర్తినిచ్చిన గురువు	13
నెమలీక	14
సీరియల్ ప్రేమ - విప్లవం	16
ఇంటర్వ్యూ అలుపెరగని పోరుగీతం	18
వ్యంగ్య వీచికలు	19
సృజన నోబెల్ అందుకున్న తొలి మహిళ	20
నవరాగం	
ఏకాంత మందిరం ఎలా ఉండాలి	22
సోర్స్‌కోడ్ షెల్ఫీలు షేర్ చేస్తున్నారా?	23
సమీక్షలు ఆచరణాత్మకమైన ప్రయోగం	24
నచ్చిన పుస్తకం ఒక యోగి ప్రస్థానం	25
ఈ వారం కవిత్వం అన్నిటినీ దాటి పోదాం	26



నిజ జీవితచరిత్రలను రమణీయ వెండితెర దృశ్యకావ్యాలుగా అందించడం ఈ కాలపు లక్షణం. ఈ క్రమంలో వస్తున్న 'బయోపిక్'లపై ఒక విశ్లేషణ ఈ వారం ముఖచిత్ర కథనం.

లేఖలు

ప్రత్యేకంగా ఉంది

ఈ వారం సోపతిలో ప్రత్యేకంగా బతుకమ్మ గురించి ఇవ్వడం బాగుంది. పేద, ధనిక, చిన్నా, పెద్దా అన్న తేడాలేకుండా మహిళలందరూ ఆడే ఆట బతుకమ్మ. పువ్వుల్లాంటి ఆడవాళ్లు కూడా ప్రకృతిలో ఓ భాగమే. ఆడపిల్లను పుట్టనిద్దాం, పెరగనిద్దాం, బతకనిద్దాం అనే ప్రత్యేక ఉద్దేశ్యంతో ఇందులోని వ్యాసాలు రాయడం అభినందించాల్సిన విషయం. 'తెలంగాణ ఆడవాళ్ల బతుకు పండుగ' వ్యాసం బాగా ఆకట్టుకుంది. ఈ పండుగకున్న పురాణ గాథలతో పాటు శాస్త్రీయ కారణాలను కూడా వివరించడంతో అందరికీ ఉపయోగంగా ఉంది. పండుగలు చేసుకోవడం ఇష్టం లేనివారు కూడా ఈ వివరణలతో వాతావరణాన్ని, సహజ సంపదలను కాపాడుకోడానికి తమ వంతు బాధ్యతగా బతుకమ్మను పేర్చుతారనడంలో సందేహం లేదు. ఇందులో అన్ని వ్యాసాలు బాగున్నాయి.

– నవీన, హైదరాబాద్

స్వేచ్ఛ, సమానత్వం...

సోపతి 'బతుకమ్మ స్పెషల్ 'లో వచ్చిన వ్యాసాలు ఆకట్టుకున్నాయి. వీటి ద్వారా రాష్ట్రంలో బతుకమ్మ గురించి ఎన్ని రకాల కథలు ప్రచారంలో ఉన్నాయో తెలిసింది. ముఖ్యంగా 'స్త్రీకి స్వేచ్ఛనిచ్చిన బతుకమ్మ' లో సాహిత్య ప్రపంచంలో 19 వ శతాబ్దానికి ముందు బతుకమ్మ ప్రస్తావన లేదని, దానికి సంబంధించిన సమాచారమూ దొరకదని, అప్పట్లో దళితులు బతుకమ్మ ఆడేవారు కాదని... ముదిగంటి సుజాత రెడ్డి కొత్త విషయాలు చెప్పారు. స్త్రీకి స్వేచ్ఛ ఉండాలని, వారిని మగవారితో సమానంగా చూడమని కోరుకునే పండుగగా అభివర్ణించడం బాగుంది.

– వినయ్, మహబూబ్‌నగర్

ఫొటోలు బాగున్నాయి

సోపతి బతుకమ్మ ప్రత్యేక సంచికలో పెట్టిన ఫొటోలన్నీ బాగున్నాయి. 'కెమెరా కన్నులో బతుకమ్మ' ఫొటో ఫీచర్‌లోని ఫొటోలు ఆకర్షించాయి. బతుకమ్మను పేర్చడం నుండి చివరి రోజు నీళ్లలో కలిపే వరకు వివిధ దశల వారీగా ఫొటోలు పెట్టడం బాగుంది. అలాగే ఆధునిక పోకడలకు అనుగుణంగా చక్కగా అలంకరించుకుని బతుకమ్మను తీసుకెళ్లే వనితల ఫొటోలు ఆకట్టుకున్నాయి.

– సుమలత, సంతోష్‌నగర్, హైదరాబాద్

పూల పండుగ

బతుకమ్మ సందర్భంగా పాడే వివిధ రకాల పాటలు బాగున్నాయి. సాధారణంగా మిగతా సమయాల్లో ఈ పాటల గురించి పెద్దగా పట్టించుకోరు. కానీ ఈ పండుగ వచ్చిందంటే చిన్నా పెద్దా అందరూ వీటినే వల్లెవేస్తుంటారు. ప్రకృతిలో లభించినా ఎవ్వరూ పట్టించుకోని పూలను బతుకమ్మను పేర్చడానికి ఉపయోగించడం, మగవాళ్లు అడవుల్లోకి వెళ్లి రావడం, ఆడపిల్లలు పుట్టింటింటికి రావడం... ఇవన్నీ ఎంతో ఆసక్తిగా ఉన్నాయి.

– సృజన, జడ్చర్ల, మహబూబ్‌నగర్

ముందు పేజీలో

సోపతి బతుకమ్మ ప్రత్యేకంలో చివరి పేజీలో వేసిన ఫొటో ముందు పేజీలో పెడితే బాగుండేది. ప్రధానంగా పల్లెల్లో ఆడపడుచులు ఎలా ఉంటారో ఈ ఫొటో ద్వారా తెలుస్తోంది.

– సాయిబాబా, హైదరాబాద్

ప్రతిదీ పాటకు వస్తువే

'తెలంగాణ ఆడవాళ్ల పండుగ' వ్యాసంలో వచ్చిన 'బతుకమ్మ పండుగ ఆడపిల్ల పుట్టుక, బతుకుకు సంబంధించిన పండుగ. ఈ పండుగ సందర్భంగా పాడే పాటల్లో ఆడోళ్ల కష్టాలు, సంతోషాలు, నిత్య దిన చర్య మొదలు సూర్య చంద్రుల వరకు ప్రతిదీ పాటకు వస్తువే' అనే ప్రస్తావన బాగుంది.

– సునీత, బడంగ్‌పేట

మన జాతీయాలు

నువ్వుల బెల్లం తిను

హిందువులు, ముస్లింలు మొదలగువారు జరుపుకునే కొన్ని పండగల్లో ఏడాది నాటి పగలు కూడ ఆ పండగ నాడు పరిసమాప్తి చేసుకొని ఆలింగనం చేసుకుంటారు. అలాంటి వాటిల్లో తెలంగాణలో సంక్రాంతి ఒకటి. సంక్రాంతి నాడు నువ్వులు బెల్లం కలిపి ఇల్లిల్లు తిరిగి అందరికి పెడుతూ "నువ్వులు బెల్లం తిను, నూరేండ్లు బతుకు, తియ్యగ తిని తియ్యగ మాట్లాడు" మని ప్రతివారితో చెప్పి పోతారు. పండగ నాటి ఆచారం పేర మొగమాటం పోగొట్టుకొని అంతవరకున్న కక్షలు, కార్పణ్యాలు సమసిపోగొట్టుకుంటారు. "ఇంకేముంది, నువ్వులు బెల్లం తిన్నడు. వాళ్ళంతా ఒక్కటైనారు. మధ్యలో మనమే కంటు" అనటంలో ఈ జాతీయం ప్రయోగం వుంది.

చిత్తుబొత్తయింది

చిత్తు అంటే చిత్తరువు, చిత్రం, బొమ్మ. బొత్తు అంటే బొరుసు. నాణేనికి రెండువైపులు వుంటాయి. అందులో ఒకవైపు చిత్రం రెండవవైపు నాణెం వివరాలుండేవి పూర్వం. చిత్రం ముఖ్యంగా రాజుగారిది అయివుండేది. ఆ కారణంగానే చిత్తుబొత్తుగా చలామణికి వచ్చింది. హిందుస్థానీ పదాలకు దగ్గరి తెలుగు చిత్తు బొత్తు. తెలంగాణలో ప్రసిద్ధం. బొమ్మ బొరుసు ఆంధ్ర ప్రాంతంలో వాడుక. చిత్తు బొత్తయింది అంటే తారుమారైంది అనుట. ప్రాణమంతా చిత్తుబొత్తైంది అంటే ఉపవాసం ఉన్నప్పుడు, రోజంతా తినకుండా వున్నప్పుడు కళ్ళకు చీకటి వచ్చి కళ్ళు బైర్లు కమ్మడం. "పొద్దంతా కసికెడు మంచినీళ్ళు తాగలేదు. ప్రాణమంతా చిత్తుబొత్తయింది" అనటంలో ఈ జాతీయం వాడుకలో వుంది.

కాటికి మొక్కుట

చనిపోయిన వారి కాటికి మొక్కటమంటే, బతికుండగా ఆయన చేసిన మేలు మరువలేక, కృతజ్ఞతగా మరణానంతరం కూడా ఆయనను దహనం చేసినచోట భక్తిశ్రద్ధలతో మొక్కుకుంటారు, స్మరించుకుంటారు. "ఆయన చచ్చేలోకాన వున్నాడో, తెల్లారి లేసి ఆయన కాటికి మొక్కాలి. నాకు ఎంతో సహాయం చేసిండు" అంటూ ఈ జాతీయాన్ని ఉపయోగిస్తారు.

– వేముల పెరుమాళ్లు

■ సంగీతం

లేత స్వప్నాల గీతలహరి

పిల్లలు.. కల్లాకపటమెరుని చిన్నారులు. పువ్వుల్లా స్వచ్ఛమైన మనసుతో ఉంటారు. కనిపించిన ప్రతిదీ నిజమని, ఎవరేం చెప్పినా సత్యమని నమ్మేస్తారు. కల్మషం లేని వారి ఆలోచనలు ప్రశాంతతనిస్తాయి. ఈ చిన్నారులు కోసం ఎన్ని పాటలో.. 'చిట్టి చిలకమ్మా అమ్మ కొట్టిందా' అన్నా, వీరీ వీరీ గుమ్మడి పండు వీరిపేరేమి' అంటూ దాగుడు మూ తలు ఆడినా వారి ప్రపంచమే వేరు. పేరుకి చిన్నారులైనా పెద్దవాళ్ల మనసుల్లో వీరిదే అగ్రస్థానం. ఇక సినిమాల్లో వీరి పాటలు ఎన్నో. నాటి లవకుశ నుండి నేటి బేబీ శ్రియాశర్మ వరకు రోజారమణి, శ్రీదేవి, నరేష్, రోహిణి, సంయుక్త, మీనా, షాలిని, షామిలి, బాలాదిత్య... ఇలా ఎందరో చిన్నారులు ప్రేక్షకులను అలరించారు.

'బాల మిత్రుల కథ' చిత్రంలో "గున్నమామిడి చెట్టుకింద గూళ్లు రెండున్నాయి. ఒక గూటిలోన రామచిలకుంది. ఒక గూటిలోనా... కోయిలుందీ..." పేద, ధనిక తేడా లేని ఇద్దరు మిత్రులకు చూడ్డానికి రెండు పాత్రాలైనా... ఎన్ని కష్టాలు వచ్చిన ఒకే మాట మీద నిలబడతామని చెప్తాడు చిన్నారి సురేంద్ర. ఆత్రేయ సాహిత్యానికి, సత్యం సంగీతానికి ఎస్.జానకి గానం ప్రాణం పోసినట్లుంది ఈ పాట వింటుంటే.

"పిల్లలూ దేవుడూ చల్లని వారేలే కల్లకపటమెరుగని కరుణామయులే ... తప్పులు మన్నించుటయే దేవుని సుగుణం. ఇది గొప్పవాళ్లు చెప్పినట్టి చక్కటి న్యాయం" లేత మనసులు చిత్రంలో కుట్టి పద్మిని కవలలుగా నటించింది. మనిషి కోపం, అహంభావం వల్ల అతని తెలివి మరుగున పడిపోతుందనే సారాంశంతో సుశీల పాడిన ఈ పాటకు ఆరుద్ర సాహిత్యం అందించారు.

"గోరింటా పూసింది కొమ్మాలేకుండా మురిపాల అరచేత మొగ్గా తొడిగింది.. ఎంచక్కా పండేనా ఎర్రాని చుక్కా... చిట్టీ పేరంటానికి శ్రీ రామ రక్ష" పాట గోరింటాకు చిత్రంలో పి.సుశీల పాడారు. దేవులపల్లి కృష్ణశాస్త్రి రచించిన పాటకు కె.వి.మహదేవన్ స్వరకల్పనలో వచ్చిన ఈ పాటలో సావిత్రి తన పిల్లల భవిష్యత్తుపై ఉన్న ఆశలన్నీ వ్యక్తం చేస్తుంది.

"బూచాడమ్మా బూచాడు... బుల్లి పెట్టెలో ఉన్నాడు... కళ్లకెప్పుడు కనపడడు కబురులెన్నో చెబుతాడు..." బడిపంతులు చిత్రంలోని ఈ పాటలో శ్రీదేవి, అంజలి కనిపిస్తారు. అప్పటికి ఫోనంటే ఏమిటో తెలిసింది చాలా తక్కువ మందికి. ఫోన్ ఎలా ఉంటుందో, ఎలా పనిచేస్తుందో వివరించే పాట ఇది. శ్రీదేవి అభినయం గురించి కొత్తగా చెప్పుకోవాల్సింది ఏముంది చెప్పండి?!

"మహాబలిపురం మహాబలిపురం మహాబలిపురం... భారతీయ కళా జగతికి ఇది గొప్ప గోపురం కట్టించాడు ఈ మూడు పల్లవరాజు...ఆ కథ చెప్పగ వచ్చాడు బాలరాజు" ఆ రోజుల్లో పల్లవ రాజులు మహాబలిపురంలోని శిల్పాల్ని ఎలా కట్టించారో, ఆ శిల్పాల్లో ఏమున్నదో, వాటిల్లో దాగున్న పురాణ గాథల్ని వివరించే పాట. 'బాలరాజు కథ' చిత్రంలోని ఈ పాటలో మాస్టర్ ప్రభాకర్ గైడుగా అక్కడి శిల్పాల్ని చక్కగా చూపిస్తాడు. ప్రభాకర్ నటన ప్రేక్షకులను కట్టి పడేస్తుంది.

"అల్లిబిల్లి రాజాకేమో అందమైన అంబారీ" అడవి వీరులు చిత్రంలోనీ ఈ పాటలో శ్రీదేవి, ప్రభాకర్ నటించారు. బొమ్మలాటగా సాగే పాట సరదాగా ఉంటుంది.

'కొండాకోనల్లో లోయల్లో... గోదారి గంగమ్మా సాయల్లో... కోరికోరి కూసింది కోయిలమ్మ.. ' పాట మంజునాథ్ 'స్వాతి కిరణం' చిత్రంలో తనకున్న సంగీత శక్తిని ఇలా పల్లెపదాల్లా పాడుతుంటాడు.

"అయామ్ వెరీ గుడ్ గర్ల్.. టెల్ మీ యువర్ టీచర్ మై డియర్ బ్రదర్...అన్ని మంచి హాబిట్స్ ఉన్నాయంట నాలో..." పాట వచ్చిన రోజుల్లో ప్రతి చిన్నారి నోటి నుండి ఇదే పాట. బాలాదిత్య, కావ్య నటించిన ఈ పాట పిల్లలకే కాదు పెద్దలనూ ఆకట్టుకుంది.

అంజలి చిత్రంలో 'అంజలి అంజలి అంజలి విరిసే నవ్వుల పువ్వుల జాబిల్లి... పున్నమి వెన్నెల జాబిలి...", జోకర్ చిత్రంలో "పాల నవ్వులోనా పగడాల వెలుగులు... పాప పలకాలి చినుకులు..., జగదేక వీరుడు అతిలోక సుందరిలో " జై చిరంజీవా జగదేక వీరా... అసహాయ శూరా అంజని కుమారా...", సిసింద్రీ చిత్రంలో చిన్ని తండ్రీ నిను చూడగా... వేయి కళ్లైనా సరిపోవురా",.... ఇలా చెప్పుకుంటూ పోతే పదులు కాదు వందల్లో పిల్లల పాటలున్నాయి. కానీ అప్పటి సినిమా పాటల్లో పిల్లల పాత్రలకు, నేటి చిత్రాల్లో పిల్లల పాత్రలకు ఎంత తేడా? నేటి సినిమాల్లో పిల్లల పాత్రల్ని చూస్తుంటే వీరు పిల్లలేనా? అన్న ఆశ్చర్యం కలుగుతుంది. పిల్లల్ని పిల్లలుగా చూపిస్తేనే బాగుంటుంది. అలా కాకుండా 'ముదుర్లు'గా చూపిస్తే ఎబ్బెట్టుగా ఉండి నవ్వుల పాలైపోతారు.

- బి.మల్లేశ్వరి

■ కవర్ స్టోరీ



స్ఫూర్తిదాయకమైన మనుషుల జీవితచరిత్రలు తెరకెక్కించడం ఈ కాలపు పరిణామం. ఇటీవలి కాలాన భాగ్ మిల్కా భాగ్, మేరీకోమ్ చిత్రాలు విజయవంతం కావడంతో సినిమా రంగాన జీవితకథా చిత్రాల ధోరణి ఊపందుకుంది. హాలీవుడ్ నుంచి బాలీవుడ్ వరకు ఈ పరంపర ఎలా కొనసాగుతుందో చెప్పే కథనమిది. అభూత కల్పనలకు తావు ఇవ్వకుండా జీవిత వాస్తవాల ఆధారంగా తెరకెక్కించే ప్రక్రియ ఆహ్వానించదగింది. చదివే అలవాటు కన్నా చూసే అలవాటు పెరిగిన కాలాన ఇలాంటి వెండితెర దృశ్యకావ్యాలని స్వాగతించాల్సిందే.

వెండి వెలుగుల జీవన చిత్రాలు

'భాగ్ మిల్కా భాగ్' (2013) చిత్రం అఖండ విజయం సాధించడంతో ఒక్కసారిగా హిందీ చిత్ర పరిశ్రమ ఉలిక్కిపడింది. అందరూ బయోపిక్ చిత్రాల వైపు చూడడం ప్రారంభించారు. ఆ కోవలో వచ్చిన 'మేరీ కోమ్' కూడా విజయవంతం సాధించడంతో హిందీతో పాటు దక్షిణాది భాషల వాళ్లు కూడా బయోపిక్‌ల వైపు దృష్టి మళ్లిస్తున్నారు.

బయోగ్రఫీ + పిక్చర్ = బయోపిక్స్. అనగా ఆత్మకథలు, జీవిత చరిత్రల ఆధారంగా తీసిన చిత్రాలను 'బయోపిక్స్' అంటారు. గతానికి లేదా వర్తమానానికి చెందిన చారిత్రక వ్యక్తులు లేదా ప్రసిద్ధుల జీవిత చరిత్రల గురించి ఇవి తెలియజేస్తాయి. ఆ వ్యక్తి ప్రతికూల పరిస్థితులను అధిగమించి ఎలా ఉన్నత శిఖరాలను అందుకున్నాడో మొదలుకుని ఆయా రంగాలలో ఆయా వ్యక్తులు సాధించిన విజయాలు, వాటి వెనుక ఉన్న కృషిని నిజాయితీగా తెలియజేస్తాయి. వాటితో పాటు ఆయా కాలాలకు సంబంధించిన ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక, రాజకీయాలను గురించి కూడా వీటి ద్వారా తెలుసుకోవచ్చు.

చారిత్రక వ్యక్తులు, మత ప్రబోధకులు, ఉద్యమ నాయకులు, సైనిక యోధులు, కళాకారులు, మేధావులు, శాస్త్రజ్ఞులు, అన్వేషకులు, వినోదకులు, రాజకీయ నాయకులు, ప్రముఖులు, నేరగాళ్లు... ఇలా రకరకాల వ్యక్తుల జీవన చిత్రాలతో ఈ బయోపిక్స్ తయారయ్యాయి. తయారవుతున్నాయి.

చలన చిత్ర పరిశ్రమ ప్రారంభమైన మూకీ దశలోనే బయోపిక్ చిత్రాల ధోరణి విదేశాలలో మొదలయింది. మనందరికీ తెలిసిన 'జోన్ ఆఫ్ ఆర్క్' చరిత్రను మొదట ఫ్రెంచ్‌లో 'జెన్నీ డి ఆర్క్' (1899), ఆంగ్లంలో సిసిల్లీ బి డిమెల్లీ 'జోన్ ది వుమెన్' (1916)గా తీశారు. అప్పట్లో నెపోలియన్ మీద (1927) ఆరు గంటల మూకీ చిత్రాన్ని బయోగ్రఫీగా తీయడం విశేషం. అప్పటికే యుద్ధ హీరోలుగా గుర్తింపబడిన నెపోలియన్, హిట్లర్, అమెరికన్ ప్రెసిడెంటు అబ్రహాం లింకన్, రష్యా అధ్యక్షుడు లెనిన్ మీద చిత్రాలు వచ్చాయి. రాజరికాలకు సంబంధించి రాణి క్లియోపాత్రో, విక్టోరియా రాణి, ఎలిజబెత్ రాణి, ఎనిమిదవ హెన్రీ, చైనా చిట్టచివరి చక్రవర్తి (ది లాస్ట్ ఎంపరర్) మీద మంచి చిత్రాలు వచ్చాయి.

ఒక ప్రముఖ వ్యక్తి గురించి నేరుగానే కాకుండా, వివిధ దశలను చిత్రిస్తూ వచ్చిన చిత్రాలు కూడా ఉన్నాయి. ఉదాహరణకు అబ్రహాం లింకన్. పెద్దవాడైన అబ్రహాం లింకన్ (1930)గా వాల్టర్ హస్టన్

నటించగా, 'యంగ్ మిస్టర్ లింకన్'గా హెన్రీ ఫోండా నటించారు. పులిట్జర్ బహుమతి గెలుచుకున్న నాటకం ఆధారంగా 'అబే లింకన్ ఇల్లినాయిన్' (1940) రూపొందగా, బానిసత్వం రద్దుకోసం లింకన్ జరిపిన కృషిని వివరిస్తూ స్టీఫెన్ స్టీల్‌బర్గ్ చిత్రం

ఒక యదార్థ వ్యక్తి జీవన చిత్రణ అనగా చారిత్రక ఆధారాలతో కూడిన ఆ వ్యక్తి నిజ జీవిత సంగ్రహణ ఈ బయోపిక్ చిత్రాల్లో కనిపించాలి. వినికిడి నిజాలతో, కల్పిత గాథలతో కూడుకున్నవి ఇందులోకి రావు. యదార్థ సంఘటన ఆధారంగా రూపొందిన చిత్రాలు, చారిత్రాత్మక చిత్రాలు ఈ పరిధిలోకి రావు. ఆయా రంగాల్లో ప్రసిద్ధులైన వ్యక్తుల జీవితం-కృషి-వ్యక్తిత్వం గురించి ప్రేక్షకులకు అంతో ఇంతో తెలిసే ఉంటుంది. అందుకే ఆయా వ్యక్తుల చిత్రీకరణలో ఎలాంటి తేడా వచ్చినా ప్రేక్షకులు తిప్పి కొడతారు.

(2012) వచ్చింది. ఇవి కాకుండా అమెరికన్ ప్రెసిడెంటు అయిన వుడ్రో 'విల్సన్(1944)' మీద, 'నిక్సన్(1995)' మీద, జార్జిబుష్ జీవితం మీద తీసిన 'డబ్ల్యు (2008)'తో పాటు జర్మన్ జనరల్ ఎర్విన్ రామ్మేల్ మీద తీసిన 'ద డిజర్ట్ ఫాక్స్ (1951)' చెప్పుకోదగినవి. 'చే' మీద తీసిన ఆరు గంటల చిత్రం రెండు భాగాలుగా విడుదల కావడం విశేషం.

ఇతరులలో హాలీవుడ్ ప్రముఖ హాస్య నటులైన 'లెన్నీ' బ్రూస్(1974) మీద, చార్లీ చాప్లిన్ (1992) మీద రిచర్డ్ అటెన్ బరో తీసిన చిత్రం, పీటర్ సెల్లర్స్ మీద హెచ్.బి.ఒ వారు తీసిన 'ది లైఫ్ అండ్ డెత్ ఆఫ్ పీటర్ సెల్లర్స్ (2004)' ముఖ్యమైనవి.

సంగీతకారుల్లో మడోన్నా మీద తీసిన 'ఎవిట(1996)' చిత్రంతో పాటు ఎల్విస్ మీద తీసిన చిత్రాలు కూడా ఉన్నాయి. ప్రఖ్యాత చిత్రకారుడు విన్సెంట్ వాంగో మీద తీసిన 'లస్ట్ ఫర్ లైఫ్(1956)', ఫ్రెంచ్ రచయిత మీద తీసిన 'ది లైఫ్ ఆఫ్ ఎమిల్ జోలా(1937)', శాస్త్రవేత్త లైన 'ది స్టోరీ ఆఫ్ లూయిస్ పాశ్చర్ (1936)', 'ది స్టోరీ ఆఫ్ అలెగ్జాండర్ గ్రాహంబెల్(1939)', మేడం క్యూరీ(1943)' నోబెల్ బహుమతి పొందిన గణిత శాస్త్రజ్ఞుడు నాష్ జీవితం ఆధారంగా 'ఎ బ్యూటిఫుల్ మైండ్' అనే చిత్రాలు వచ్చాయి. ఇవే కాకుండా సంచలన కారకులైన వారిలో స్వలింగ సంపర్క ఉద్యమకారుడు హార్వే 'మిల్క్', బూతు చిత్రాల పితామహుడిపై 'కింగ్ ఆఫ్ ది న్యూడ్స్(2009)', పోర్నో ఫిలిం ఇండస్ట్రీ మరియు తారల మీద 'బూగీ నైట్స్(1997)', 'వండర్‌ల్యాండ్(2003)' లాంటి చిత్రాలు కూడా వచ్చాయి. క్లాసిక్స్‌గా పేరు పొందిన 'సిటిజన్ కేన్స్(1941)', లారెన్స్ ఆఫ్ అరేబియా(1962), రేజింగ్ బుల్(1980), షిండ్లర్స్ లిస్ట్(1993), యునైటెడ్ 93లు కూడా బయోపిక్‌లే.

చారిత్రక వ్యక్తులుగా నటించడం అంత సులభం కాదు. వారి వేషభాషలు, అలవాట్లు, మేనరిజంతో అచ్చు అలానే కనిపించాలి. అలా ఆ పాత్రలో పరకాయ ప్రవేశం చేసినట్లుగా నటించి, ఉత్తమ నటుడిగా అవార్డులు అందుకున్న వారు కూడా ఉన్నారు. 1933లో తీసిన 'ది ప్రైవేట్ లైఫ్ ఆఫ్ హెన్రీ-8'లో నాయక పాత్రధారిగా నటించిన చార్లెస్ లాటన్ ఉత్తమ నటుడిగా అవార్డు అందుకున్నారు. బయోపిక్ చిత్రాల నాయకుడిగా పేరుపొందిన పాల్‌ముని ఫ్రెంచ్ శాస్త్రవేత్త 'లూయీ పాశ్చర్'గా(1936) నటించినందుకు ఉత్తమ నటుడిగా, 'గాంధీ' (1982)గా నటించిన బెన్‌కింగ్‌స్లే, లింకన్ (2012)గా నటించిన డానియెల్ డే లూయిస్ ఉత్తమ నటనకు అవార్డులు అందుకున్నారు.

ఒక యదార్థ వ్యక్తి జీవన చిత్రణ అనగా చారిత్రక ఆధారాలతో కూడిన ఆ వ్యక్తి నిజ జీవిత సంగ్రహణ ఈ బయోపిక్ చిత్రాల్లో కనిపించాలి. వినికిడి నిజాలతో, కల్పిత గాథలతో కూడుకున్నవి ఇందులోకి రావు. యదార్థ సంఘటన ఆధారంగా రూపొందిన చిత్రాలు, చారిత్రాత్మక చిత్రాలు ఈ పరిధిలోకి రావు. ఆయా రంగాల్లో ప్రసిద్ధులైన వ్యక్తుల జీవితం-కృషి-వ్యక్తిత్వం గురించి ప్రేక్షకులకు అంతో ఇంతో తెలిసే ఉంటుంది. అందుకే ఆయా వ్యక్తుల చిత్రీకరణలో ఎలాంటి తేడా వచ్చినా ప్రేక్షకులు తిప్పి కొడతారు. అబద్ధాలతో, కట్టుకథలతో వచ్చిన ఆత్మకథలను బయోపిక్‌గా గుర్తించరు. వ్యక్తి ప్రాధాన్యత కలిగిన ఇలాంటి చిత్రాలలో ప్రముఖ నటులు నటిస్తేనే ఆ చిత్రాలకు విలువ పెరుగుతుంది.



విజయావకాశాలు పెరుగుతాయి. ఇప్పటికీ ఇదే సంప్రదాయం కొనసాగుతుంది. అలా ప్రఖ్యాత హాలీవుడ్ నటుడైన జానీడెప్ 'ఎడ్‌వుడ్(1994)'గా, జిమ్‌కారీ 'మ్యాన్ ఆఫ్ ది మూన్(1999)' నాయకుడైన అండీ కాఫమన్‌గా 'జెమీఫాక్స్ రే' (2004)గా నటించారు. కొన్ని సందర్భాల్లో ఆయా వ్యక్తులతోనే వారి ఆత్మకథలను చిత్రీకరించడం కూడా కనిపిస్తుంది. అలా జాకీ రాబిన్ సన్ 'ది జాకీ రాబిన్ సన్ స్టోరీ'లో, బాక్సర్ మహ్మద్ అలీ 'ది గ్రేటెస్ట్'లో ఆడీ మర్ఫీ 'టు హెల్ అండ్ బ్యాక్', పాట్ డ్యూక్ 'కాల్ మీ అన్నా'లో, బాబ్ మతియాస్(Bob Mathias) 'ది బాబ్ మతియాస్ స్టోరీ'లో, అర్లో గుత్రీ 'అలైస్ రెస్టారెంట్'లో, హోవార్డ్ స్టెర్న్ 'ప్రైవేట్ పార్ట్స్'లో తమ పాత్రల్లో తామే నటించారు.

పాత్రకు తగ్గ నటులను ఎంపిక చేసుకోవాలే తప్ప, ప్రముఖ నటులను గుడ్డిగా పెట్టి తీసినా ప్రేక్షకులు రిసీవ్ చేసుకోరు. అలా ప్రధాన పాత్రధారి విషయంలో వివాదాలను ఎదుర్కొన్న సంఘటనలు కూడా ఉన్నాయి. ఏ మాత్రం పోలిక లేని ఆంథోనీ హాప్‌కిన్స్ 'నిక్సన్'గా నటించి విమర్శలను ఎదుర్కోవడంతో, తాను ఆ పాత్ర చేయాల్సింది కాదని ఆయన ఒప్పుకున్నారు. మంగోలు పోలిక లేని జాన్‌వేన్ 'ది కాంకరర్' చిత్రంలో చెంఘిజ్ ఖాన్‌గా నటించడం అలాంటిదే. ఈజిప్ట్ అధ్యక్షుడు అన్వర్ 'సాదత్'మీద 1982లో టీవీ సీరిస్‌లో నటించిన లూయిస్ గోసెట్ జూనియర్ ఆ పాత్రకు నప్పలేదని ఈజిప్షియన్ విమర్శకులు నిరసించారు. అలాగే 'సెలెనా'గా నటించిన జెన్నీఫర్ లోపెజ్ ప్యూర్టోరికన్ ఉచ్చారణలో మాట్లాడుతుంది. కానీ సెలెనా మెక్సికో అమెరికన్. ఆమె ఉచ్చారణ వేరు. జిమ్ మోరిసన్ అనే సంగీతకారుడి మీద తీసిన 'ది డోర్స్' చిత్రంలో చూపులకు పాట పాడే తీరులో అచ్చు జిమ్ మోరిసన్ లాగే కనిపించాడని నటుడు వాల్ కిల్మర్‌ను అంతా ప్రశంసించారు. కాని జిమ్ మోరిసన్ అభిమానులు, అతనితో పని చేసినవారు మాత్రం ఆయన్ను వ్యతిరేకించారు. ఈ చిత్రంలో కావాలని కొన్ని సన్నివేశాలను కల్పించారని కూడా విమర్శించారు.

భారతీయ చిత్ర పరిశ్రమలో బయోపిక్స్ :

1946లో తీసిన 'డా॥కొట్నీస్ కి అమర్ కహానీ' చిత్రంలో మన దేశంలో బయోపిక్స్ ప్రారంభమైనవని చెప్పవచ్చు. ప్రముఖ కవి సాహిర్ లూధియాన్వి జీవిత కథ ఆధారంగా తీసిన 'ప్యాసా' తన జీవితం ఆధారంగా గురుదత్ తీసుకున్న 'కాగజ్ కే ఫూల్' బయోపిక్ లాంటిదే. ఇందులో ప్యాసా సూపర్ హిట్ కాగా, కాగజ్ కే ఫూల్ అట్టర్ ఫ్లాప్ అయింది. తర్వాత కాలంలో ఈ రెండూ క్లాసిక్స్ గా గుర్తింపబడ్డాయి. రాజ్ కపూర్ తీసిన 'మేరానామ్ జోకర్' వ్యక్తిగతమూ, స్వీయకథాత్మకం. శ్యామ్ బెనెగల్ తీసిన 'భూమిక' ఒక నటీమణి జీవిత చరిత్ర. అది ఎవరిదైనా కావచ్చు. సొహ్రాబ్ మోడీ తీసిన చివరి చిత్రం 'మీనాకుమారి కి అమర్ కహానీ' బయోపిక్ చిత్రమనే చెప్పాలి. మళ్లీ ఇప్పుడు మీనా కుమారి మీద మరో చిత్రం ప్రారంభం కానున్నది.

'గాంధీ' ఆంగ్ల చిత్రం విజయంతో మన నాయకుల మీద మనమే ఎందుకు సినిమాలు

పాత్రకు తగ్గ నటులను ఎంపిక చేసుకోవాలే తప్ప, ప్రముఖ నటులను గుడ్డిగా పెట్టి తీసినా ప్రేక్షకులు రిసీవ్ చేసుకోరు. అలా ప్రధాన పాత్రధారి విషయంలో వివాదాలను ఎదుర్కొన్న సంఘటనలు కూడా ఉన్నాయి. ఏ మాత్రం పోలిక లేని ఆంథోనీ హాప్‌కిన్స్ 'నిక్సన్'గా నటించి విమర్శలను ఎదుర్కోవడంతో, తాను ఆ పాత్ర చేయాల్సింది కాదని ఆయన ఒప్పుకున్నారు.

తీయకూడదు అన్న ఆలోచన వచ్చింది. అలా స్వాతంత్ర్య సమరంలో సర్దార్ వల్లభాయ్ పటేల్ నిర్వహించిన పాత్రను తెలిపే 'సర్దార్ (1993)' పాత్రలో పరేశ్ రావెల్ నటించారు. బందిపోటు రాణి పూలన్ దేవిగా సీమా బిశ్వాస్ 1994లో 'బాండిట్ క్వీన్'గా నటించారు. 'ఫర్‌గాటెన్ హీరో(2004)' అంటూ సుభాష్ చంద్రబోస్ మీద తీసిన చిత్రంలో బోస్‌గా సచిన్ ఖేడేకర్ నటించారు. గాంధీ కుమారుడైన హరిలాల్ గాంధీ తన తండ్రితో విభేదాలను 'గాంధీ మై ఫాదర్(2007)' చిత్రంలో చూపించారు. ఇందులో హరిలాల్‌గా అక్షయ్‌ఖన్నా, గాంధీగా దర్శన్ జరివాలా నటించారు. ప్రఖ్యాత చిత్రకారుడు రవివర్మ మీద తీసిన 'రంగ్ రసియా(2008)లో రవివర్మగా రణ్‌దీప్ హుడా నటించారు. ఆత్మహత్య చేసుకున్న దక్షిణాది నటి సిల్క్‌స్మిత జీవితం ఆధారంగా తీసిన 'ది డర్టీ





పిక్చర్'లో సిల్క్‌స్మితగా విద్యాబాలన్ నటించారు. లాయర్, మానవ హక్కుల కార్యకర్త షాహిద్ అజ్మీ జీవితం ఆధారంగా 'షాహిద్(2013)' చిత్రం వచ్చింది. అథ్లెట్‌గా ఉండి ఆర్మీలో పనిచేసి బందిపోటుగా మారిన 'పాన్ సింగ్ తొమార్(2013)గా ఇర్ఫాన్ నటించారు. ఫ్లైయింగ్ సిఖ్‌గా పేరుపొందిన అథ్లెట్ మిల్కాసింగ్ జీవిత కథ ఆధారంగా 'భాగ్ మిల్కా భాగ్(2013)' చిత్రం వచ్చింది. ఈ సినిమా నూరు కోట్లకు పైగా వసూలు చేయడంతో ఇప్పుడు అందరి దృష్టి బయోపిక్స్ మీద పడింది. అలా లేడీ బాక్సర్ మేరీకోమ్(2014) ప్రియాంక చోప్రా నటించిన చిత్రం కూడా విజయవంతం కావడంతో అందరి దృష్టి బయోపిక్‌ల మీదకు మళ్లింది. త్వరలో అక్షయ్ కుమార్ హీరోగా

ఉత్తరాది స్మగ్లర్ హాజీమస్తాన్ మీద తీసిన 'దీవార్' చిత్రం దక్షిణాదిలో కూడా రీమేక్‌గా విజయం సాధించింది. అలాగే దక్షిణాది స్మగ్లర్ వరదరాజ మొదలియార్ మీద తీసిన 'నాయకన్' చిత్రం ఉత్తరాదిలో కూడా విజయం సాధించడానికి కారణం అవి బయోపిక్‌లని కాదు. మసాలా చిత్రాలుగా రూపొందించడం వల్లే విజయవంతం కాగలిగాయి.

దారాసింగ్ బయోపిక్, రణబీర్ కపూర్ హీరోగా కిశోర్‌కుమార్ బయోపిక్, విద్యాబాలన్ హీరోయిన్‌గా యం.ఎస్.సుబ్బులక్ష్మి బయోపిక్, షారుఖ్‌ఖాన్ హీరోగా ధ్యాన్‌చంద్ బయోపిక్, మనీషా కొయిరాలా హీరోయిన్‌గా మీనాకుమారి బయోపిక్ రూపొందనున్నాయి.

తెలుగు చిత్ర పరిశ్రమలో...

తెలుగులో బయోపిక్‌కు, మసాలా సినిమాకు మధ్య తేడా లేకుండా పోయింది. 'మహాకవి కాళిదాసు, తెనాలి రామకృష్ణ, భక్త పోతన, శ్రీనాథకవి సార్వభౌముడు' లాంటి కవి, పండితులపైన, 'అన్నమయ్య, రామదాసు, త్యాగయ్య, జయదేవుడు' లాంటి వాగ్గేయకారులపైన, 'మహామంత్రి తిమ్మరుసు, చాణక్య చంద్రగుప్త, వీరపాండ్య కట్ట బ్రహ్మన్న, అల్లూరి సీతారామరాజు, విశ్వనాథ నాయకుడు'లాంటి చారిత్రక వ్యక్తుల మీద తీసిన చిత్రాలు వున్నా, ఇవన్నీ బయోపిక్స్ చిత్రాలు కావు. కల్పితాలు, కట్టుకథలతో కూడుకుని ఉన్న చిత్రాలే ఇవి.

ఉత్తరాది స్మగ్లర్ హాజీమస్తాన్ మీద తీసిన 'దీవార్' చిత్రం దక్షిణాదిలో కూడా రీమేక్‌గా విజయం సాధించింది. అలాగే దక్షిణాది స్మగ్లర్ వరదరాజ మొదలియార్ మీద తీసిన 'నాయకన్' చిత్రం ఉత్తరాదిలో కూడా విజయం సాధించడానికి కారణం అవి బయోపిక్‌లని కాదు. మసాలా చిత్రాలుగా రూపొందించడం వల్లే విజయవంతం కాగలిగాయి. వీరప్పన్, ఛార్లెస్ శోభారాజ్, బిల్లారంగాలతో పాటు, డాకూ మంగళ్‌సింగ్ లాంటి బందిపోటు నాయకులు కూడా హీరోలుగా వచ్చేశారు. 'శ్రీరాములయ్య' లాంటి ఫ్యాక్షనిస్టు, నాయకుడు 'రక్తచరిత్ర'లో నక్సలైట్ పరిటాల రవి జీవితం కనిపించి ఆ చిత్రాలు విజయవంతం అయినా 'రాజన్న, సీతక్క'ల గురించి పట్టించుకున్నవారే లేకపోయారు. అంగ వైకల్యాన్ని అధిగమించి నాట్యకారిణిగా ఎదిగిన సుధాచంద్రన్ కథను ఆమెతోనే 'మయూరి' గా తీసి విజయం సాధించడం ఒక రికార్డ్. అలాగే అథ్లెట్ 'అశ్విని' నాచప్పపై వచ్చిన సినిమా పెద్దగా ఆకట్టుకోలేకపోయింది.

క్రీస్తుగా, సాయిగా, వేమనగా, ప్రకాశం పంతులుగా నటించిన విజయచందర్‌ని హాలీవుడ్ పాల్‌ముని అనే మెచ్చుకోవాలి. మొన్న వచ్చిన 'కొమరం భీం', త్వరలో రానున్న 'రుద్రమదేవి' బయోపిక్ లక్షణాలతో తీస్తున్న చిత్రాలనే చెప్పాలి.

తెలుగులో నిజమైన బయోపిక్ చిత్రాలు రావడానికి అవకాశం లేదు. మనవాళ్లకు నిజాయితీగా ఆత్మకథలు రాసుకునే అలవాటే లేదు. ఏం రాసినా తమ గొప్పలు చెప్పుకోవడమే. చాలామంది తమ విజయ గాథలనే ఆత్మకథలుగా రాసి చెలామణి చేసుకుంటున్నారు. హీరోయిజం, మసాలా సినిమాలకు అలవాటుపడిన తెలుగు ప్రేక్షకుడు ఇప్పుడు వచ్చే బయోపిక్స్‌ను ఆదరించడం కూడా కష్టమే.

-కె.పి.అశోక్ కుమార్,

సెల్ :9700000948









■ కథ : బి.వి.ఎన్.స్వామి

మార్పు



కలర్స్‌తో వరండా కొలువుదీరింది. దూరం నుండి చూస్తే, అక్కడంతా హడావిడి కనిపిస్తుంది. అదేంటో చూడాలనిపించింది. ఇంతలో నా దగ్గరికి శేఖర్ పరుగెత్తుకుంటూ వచ్చిండు. రండి సార్ అంటూ చేయి పట్టుకొని అటు వైపు తీసుకెళ్ళిండు.

అక్కడ ఏం జరుగుతుంది.

చిత్రకళా ప్రదర్శన

ఎవరిది

మన స్కూల్ పిల్లలే పోయిన సంవత్సరం వేసిన డ్రాయింగ్స్ అన్నింటిని ప్రదర్శనకు పెట్టిండ్రు. అలా మాట్లాడుకుంటూ వెళ్ళేసరికి వరండా వచ్చింది. ఒక్కో చిత్రం వద్ద ఒక్కొక్కరు నిలబడి, చిత్రానికి చెందిన వివరాలు తెలుపుతున్నారు. అమ్మాయిలతో, అబ్బాయిలతో వరండా మొదలు తరగతి గదులు నిండిపోయాయి. ఒక్కోగదిలో టీచర్స్ గుంపుగా డ్రాయింగ్స్ చూసుకుంటూ కామెంట్స్ విసురుతున్నారు. సలహాలు ఇస్తున్నారు. అంతవరకు నాతో ఉన్న శేఖర్ పక్కనున్న గదిలోకెళ్ళి డ్రాయింగ్స్ చూడడంలో మునిగిపోయాడు. నేను ఒక్కడినే ఒక్కొక్కటి చూడడం మొదలుపెట్టాను.

వాటర్ కలర్స్‌తో వేసిన చిత్రాలు ఒకవైపు, పెన్సిల్ వర్క్‌తో చేసిన డ్రాయింగ్స్ మరోవైపు, కేయల్ ఇండియన్ ఇంక్‌తో వేసిన ఆర్ట్ ఒక దిశగా, క్రియాన్స్‌తో చిత్రించిన బొమ్మలు మరో దిశలో అందంగా అమర్చారు. కళ్ళు కలర్స్‌తో నిండిపోయాయి. చమ్కీలతో కూడిన చిత్రాలు ఆనందం కల్గిస్తున్నాయి. కలర్ పెన్సిల్ వర్క్ కూడా ఆకర్షణీయంగా ఉంది. అన్ని చూసుకుంటూ

వెళ్ళుతున్న నాకు, విద్యార్థుల హస్తకళానైపుణ్యం అబ్బురపరచింది. చిత్రాలు ఏయే విషయాల్ని చెబుతున్నావో పరిశీలించాను. తరగతి గది దృశ్యం, పాఠశాల ఆవరణ, ఆదర్శగ్రామం, జాతీయసమైక్యత, జలపాతం, పంటపొలం, దేవతలు, దేశభక్తులు, పక్షులు ఇలా అనేకం కొలువుదీరాయి. ప్రతి ఒక్కటి అందంగా, ఆకర్షణీయంగా ఉన్నది. అలా చూసుకుంటూ

వెళ్తున్నా నా పాదాలు ఒక చోట ఆగిపోయాయి. ఏ మాత్రం తేమ, పచ్చదనం లేని ప్రకృతిలో నిలువెత్తు దేవాలయం ఉంది. దాని కింద చిన్నగుట్ట అని రాసుంది. పక్కన హరిత నవ్వుతూ ఉంది. ఆగిన నన్ను చూసి "నమస్తే సార్" అంది.

"హరితా! ఇందులో గుట్ట ఎక్కడుందమ్మా"

"గుడి అడుగే గుట్ట సార్"

"నాకు తెలిసి గుట్ట కాస్త పెద్దగానే ఉండేది"

"ఇప్పుడు అలా లేదు. నేను చూసి వచ్చినాంకనే ఈ బొమ్మగీసిన"

"నువ్వు ఎప్పుడు చూసినవు. అక్కడి విశేషాలు చెప్పు" అంటూ ఆమెను కాస్త పక్కకు తీసుకెళ్ళాను. తన అనుభవాన్ని వివరించింది.

"డాడీ రేపు ఆదివారం"

"అయితేంటి"

"మనం చిన్నగుట్టకు వెళ్ళాలి"

"వచ్చే ఆదివారం అన్నాను కదా" అంటూ నవ్వాడు.

"అవును. రేపు ఆదివారమే కదా" బదులిచ్చింది.

"అవును కదూ! ఇంతకీ చిన్నగుట్ట అంటే నీకెందుకంత ఇష్టం"

"అమ్మమ్మ, తాతయ్యలతో కలిసి మనందరం ఒకసారి గుట్టకు వెళ్ళాం మీకు గుర్తుందా"

"ఎప్పుడు"

"నేను నాలుగవ తరగతిలో ఉన్నప్పుడు"

" ఓ! అవును"

"అక్కడ చాలా బాగుంటుంది కదా. గుట్టపైన విశాలమైన స్థలం ఉంది. రకరకాల చెట్లతో కొండంతా పచ్చగా ఉంది. పచ్చదనం అంటే నాకు ఎంతో ఇష్టమని మీకు తెలుసుకదా డాడీ. అక్కడున్న కొన్ని చెట్ల పేర్లను అడిగితే మీరు కూడా చెప్పలేకపోయారు. కొండ అంచున నిలబడి చూస్తే కింద ఉన్న ఊర్లన్నీ థర్మాకోల్‌పై అతికించిన బొమ్మల్లా కనపడ్డాయి. కొండమీద సొరికే చూస్తే చీకటిగా, భయంకరంగా ఉన్నా దాన్నుండి వచ్చే రీసౌండ్, స్పీకర్ నుండి వచ్చే సౌండ్‌కంటే క్లీయర్‌గా ఉంది. కొండమీదున్న పాలదోనెలోని నీళ్ళు చల్లగా, తీయగా ఉన్నాయి. అన్ని కాలాల్లోనూ అందులో నీళ్ళుంటాయని తాతయ్య చెప్పినపుడు ఆశ్చర్యమేసింది. కొంతమంది చెట్ల ఆకులను, తీగలను మందులకోసం తీసుకుపోవడం చూసాను. నిటారుగా ఉన్న కొండరాళ్ళను ఎక్కలేక చతకిలపడ్డప్పుడు తీసిన ఫొటో ఇప్పటికీ నా దగ్గరుంది. కోతులు, కుందేళ్ళు హాయిగా తిరగడం చూస్తే సంతోషం అనిపించింది. అందరం దేవుడికి పూజలు చేశాం. దేవుడికక్కడ గుడెందుకు లేదు డాడీ?"

ప్రశ్నించింది హరిత.

"అక్కడ దేవుడు బండకు వెలిసాడమ్మా"

"నిజమే పెద్దబండకు దేవుని బొమ్మ చెక్కినట్లుంది. పూజయ్యాక అందరం చెట్టు కింద కూర్చొని భోజనాలు చేశాం. తర్వాత ఆడి పాడి అలసటతో నిద్రపోయి, సాయంకాలం తిరిగి ఇంటికి వచ్చాం. నిజంగా అదొక పిక్నిక్ స్పాట్ కదా డాడీ. అందుకే మళ్ళీ వెళ్ళాలని పిస్తుంది."

"మంచిదమ్మా రేపు తప్పనిసరి వెళ్దాం.

ఆదివారం నాడు హరిత తన తల్లిదండ్రులతో బయల్దేరింది. మనసు ఉరకలేస్తుంది. వాహనం దూసుకెళ్తుంది. గంట ప్రయాణం సాగింది. రోడ్డు పక్కన దేవస్థానం బోర్డు స్వాగతిస్తూ కనపడింది. రోడ్డు ఇరువైపులా దూకాణాలు వెలిశాయి. కిందినుండే గుడి అందంగా కనపడుతుంది. కారు నేరుగా గుడిముందు ఆగింది. ట్యాప్‌ల ద్వారా నీళ్ళు వస్తున్నాయి. కాళ్ళు కడుక్కొని నేరుగా గుళ్ళోకి వెళ్ళారు. పూజయ్యాక బయటకు వచ్చారు.

'అక్కడ చాలా బాగుంటుంది కదా. గుట్టపైన విశాలమైన స్థలం ఉంది. రకరకాల చెట్లతో కొండంతా పచ్చగా ఉంది. పచ్చదనం అంటే నాకు ఎంతో ఇష్టమని మీకు తెలుసుకదా డాడీ. అక్కడున్న కొన్ని చెట్ల పేర్లను అడిగితే మీరు కూడా చెప్పలేకపోయారు. కొండ అంచున నిలబడి చూస్తే కింద ఉన్న ఊర్లన్నీ థర్మాకోల్‌పై అతికించిన బొమ్మల్లా కనపడ్డాయి.

"డాడీ కొండ చాలా మారింది కదా"

"అవును"

"చెట్లన్నీ పోయాయి. ఉన్నవాటిలో పచ్చదనం లేదు."

"అయ్యో! గుడి వెనక చిన్నతోట మాత్రమే ఉంది. సొరిక లేదు పాలదోనె లేదు. అసలు కొండే మాయమయింది. అటు చూడు అక్కడేవో మిషన్లున్నాయి" అంది హరిత.

"అవి స్టోన్ క్రిషింగ్ మిషన్లు. కొండను పగులగొట్టి రాయి తీసుకేళ్ళారు."

"ఎందుకు? ఎటు" ప్రశ్నించింది హరిత.

"ఇక్కడి రాయి విలువైంది. నిర్మాణాలకు ఉపయోగపడుతుంది. బండ పగలగొట్టి, సైజులుగా మార్చి అమ్ముతున్నారు"

"చెట్లను కొడితే, మరిన్ని చెట్లను నాటవచ్చు. కొండలను పిండిచేస్తే తిరిగి వాటిని పెంచేదెలా?"

"మాటలతోటే కాలం గడుపుతరా. భోజనాలు వద్దా" అరిచింది తల్లి.

"ఇంటివెళ్ళి తిందామమ్మా. అంతా దుమ్ము, రాయిపొడి ఉంది" అంది హరిత

"తెచ్చుకున్నవి తినక మళ్ళీ తీసుకపోవుడేంది. అక్కడ తోటలోని సిమెంటు బెంచిమీద కూర్చొని తిందాం" అంది తల్లి.

అయిష్టంగా తిండి అయిందని పించాను. చెప్పడం ముగించి నా దిక్కు చూసింది. నవ్వడం నా వంతయింది.

"దేవుని గుట్టను కొడితె పాపం తగలదా" ప్రశ్నించింది.

"పాపం పుణ్యం దేవుడెరుగు. వర్షం పడుతుందా మన దగ్గర"

"మబ్బులస్తున్నాయి, కాని వర్షం పడుత లేదు."

"నీవు పాఠాల్లో చదివినట్లు అడవులు, గుట్టలు అంతరిస్తే వర్షం పడదు కదా"

"ఇట్లెందుకు చేస్తున్నారు సార్"

"అభివృద్ధి పేరున అడవుల్ని, ఆధునికత కోసం గుట్టల్ని నాశనం చేస్తున్నారు" అంటూ ముందుకు నడిచాను.

రచయిత సెల్ : 9247817732

■ అలనాటి పత్రిక : ఎస్వీ రామారావు

ఓరుగల్లు విశిష్ట సాహిత్య పత్రికలు

కాకతీయ యుగంలోని సాంస్కృతిక చైతన్యానికి వారసత్వంగా నిలిచిన ఓరుగల్లు నుంచి 1922-54 మధ్య విశిష్టమైన సాహిత్య పత్రికలు నాలుగు వెలువడ్డాయి. వాటిలో తెనుగు, ఆంధ్రాభ్యుదయం తర్వాత పేర్కొనదగినవి కాకతీయ, శోభ పత్రికలు

కాకతీయ (1944-54)

తెలంగాణ ప్రాంత రాజకీయ, సాంఘిక, సాహిత్య పత్రికలుగా పేరొందిన 'కాకతీయ' పాములపర్తి సదాశివరావు సంపాదకత్వంలో వరంగల్ నుండి వెలువడింది. నాలుగు సంచికల తర్వాత 1946 నుండి పున: ప్రారంభమై తొలుత మాసపత్రికగానూ, తర్వాత వారపత్రికగానూ 1954 వరకు కొనసాగింది. సదాశివరావుకు సమీపబంధువు (వరుసకు అన్న) అయిన పి.వి.నరసింహారావు (తర్వాత రాష్ట్రమంత్రి, ప్రధానమంత్రి) మారుపేర్లతో ఈ పత్రికలో హాస్య రచనలు చేస్తుండేవారు. నాటి ప్రజాఉద్యమాన్ని చిత్రించిన ఆయన 'రామవ్వ' కథ ఇందులోనే (1949) ప్రచురితం. దాశరథి కవితలు, సి.నారాయణరెడ్డి తొలి పద్యాలు కూడా ఇందు ముద్రితమయ్యాయి. 'కాకతీయ' సంచికలు నేడు ఉపలబ్దం కాకపోవటం దురదుష్టకరం.

శోభ (1947-48, 1950-51)

సుప్రసిద్ధ సాహితీవేత్త, సాహిత్య సంస్థ నిర్వహణ అధ్యక్షులు అయిన దేవులపల్లి రామానుజరావు సంపాదకత్వంలో వరంగల్ నుండి వెలువడిన మరొక సాహిత్య మాసపత్రిక 'శోభ' సర్వజిత్ ఉగాదినాడు (1947) ప్రారంభమైన శోభ మధ్యలో ఒక సంవత్సరం (1949) అవాంతరం ఏర్పడినా, 1947 నుండి 1951 వరకు కొనసాగింది. "ఆంధ్రసరస్వతి నారాధింప వలెనను ఉత్సాహమే మా ఈ సాహసములకు మూలకారణం. తెనుగు రసికలోకపు ఆదరణయందు మాకు సంపూర్ణ విశ్వాసము గలదు" అని తొలి సంచికలో పేర్కొన్న రామానుజరావు సమకాలీన సాంఘిక, రాజకీయ పరిస్థితులపై వెలువరించిన సంపాదకీయాలు ఆసక్తికరంగా ఉండేవి.

తెలంగాణ సాహితీమూర్తులుగా వెలుగొందిన సురవరం, ఆదిరాజు, గడియారం, కాళోజీ, దాశరథి, వామనమల్లై, భాస్కరభట్ల కృష్ణారావు, నెల్లూరి కేశవస్వామి, పొట్లపల్లి రామారావు, బూర్గుల రంగనాథ రావు, సింగరాజు లింగమూర్తి, వెల్దుర్తి మాణిక్యరావు, ధరణికోట శ్రీనివాసరావు, పల్లా దుర్గయ్య, కాంచనపల్లి వెంకటరామారావు, పర్సా వెంకటేశ్వరరావు, పులిజాల హనుమంతరావు, గోపాలరావు మున్నగువారి కవితలు, కథలు, పరిశోధన వ్యాసాలు, గ్రంథ సమీక్షలు, పాశ్చాత్య కవి పరామర్శలతో ఈ పత్రిక శోభాయమానంగా ప్రకాశించింది.

"పాతకొత్తల మేలికలయికను సాధింప వలసిన యవసరము నేడు మనకున్నది. దానిని మరువక అభ్యుదయ మార్గముల ననుసరింపవలెను" అన్న ఆదర్శముతో పత్రికను నడిపిన దేవులపల్లి 1947లో దినపత్రికగా మారిన గోలకొండ పత్రికకు కొంతకాలం సంపాదకులుగా ఉన్నారు.

పత్రికా సంపాదకుడుగా, కవిత్వ విమర్శకుడుగా, సాహిత్య సంస్థనిర్వహణ దక్షుడుగా, విద్యావేత్తగా, నిష్కళంక జీవనుడుగా, నిరాడంబర వ్యక్తిగా పేరు గడించిన దేవులపల్లి రామానుజరావు(1917-1993) తెలంగాణ సాంస్కృతిక పునరుజ్జీవనంలో కీలకపాత్ర పోషించారు. 25 ఆగస్టు 1917న వరంగల్‌లో (దేశాయిపేట) భూస్వామ్య కుటుంబంలో జన్మించిన ఆయన నిజాం కాలేజీ నుంచి బి.ఎ. డిగ్రీ (1939), నాగపూర్ యూనివర్శిటీ నుంచి ఎల్ఎల్‌బి పట్టా (1944) పొందాడు. ఉన్నత పదవులు అధిష్టించగలిగినా స్వత: ఆయనలో ఉన్న భాషాభిమానం ఆయన జీవితాన్ని సాహితీరంగం వైపు మరలించింది.

వరంగల్ శబ్దానుశాసన గ్రంథాలయం కార్యదర్శిగా (1943-47) ఉన్న రామానుజరావు తర్వాత హైదరాబాద్ జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షులుగా (1966-73) గ్రంథాలయాల అభివృద్ధికి దోహదం చేశారు. 'తెలంగాణ' దిన పత్రికలో వ్యాసరచనను ప్రారంభించి, స్వయంగా 'శోభ' సాహిత్య మాస పత్రికను నిర్వహించారు. సురవరం తర్వాత గోలకొండ పత్రిక సంపాదక సభ్యులుగా (1948-66) సంపాదకీయాలు రాశారు. స్వయంకృషితో బహుభాషాకోవిదులైన ఆయన అన్ని ప్రక్రియలను క్షుణ్ణంగా అధ్యయనం చేశారు. 'పచ్చతోరణం' కవితా సంపుటి ఆయన భావుకతకు వ్యాస మంజూష, నవ్య కవితా నీరాజనము, సారస్వత నవనీతము మున్నగు వ్యాస సంపుటులు విమర్శనాత్మక దృష్టికి ప్రతీకలు.

హైస్కూలు, కాలేజీ స్థాయిలో ప్రాంతీయ భాష అయిన తెలుగుకు స్థానం కల్పించడానికి ఉద్యమాలు సల్పిన దేవులపల్లి ఉస్మానియా సెనేట్‌సిండికేట్ సభ్యులుగా, యాక్టింగ్ వైస్ చాన్సలర్‌గా విద్యారంగానికి చేసిన సేవ నిరుపమానవైనవి. ఆంధ్ర సారస్వత పరిషత్తు (1952-1993) ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ (1956) అధ్యక్ష, కార్యదర్శులుగా భాషా సాహిత్య రంగాలకు అందించిన సేవలు ఆయన కీర్తి పతాకలుగా నిలుస్తాయి. సారస్వత పరిషత్తు చిన్న మొక్కలుగా ఉన్న దశ నుంచి నారూ నీరు పోసి మహావృక్షంగా రూపుదిద్దిన కీర్తి మూర్తి. రాజ్యసభ సభ్యులుగా (1960-62) కొనసాగిన రామానుజరావు 1993 జూన్ 6న పరమపదించారు.

రచయిత సెల్ : 9848012053

స్ఫూర్తినిచ్చారు

నా పేరు కామిడి సతీష్ రెడ్డి నేను వరంగల్ జిల్లాలోని గణపురం మండలంలోని కర్కపల్లి యు.పి.ఎస్‌లో ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నాను. నాకు నచ్చిన టీచర్ మా నాన్నగారే (కీ॥శే॥ కామిడి మధుసూధన్ రెడ్డి). మా నాన్న సుమారు 25 సంవత్సరాలు టీచర్‌గా, మండల విద్యాధికారిగా పనిచేసారు. చిట్యాల మండలం చల్లగరిగ హైస్కూల్‌లో నా ప్రాథమిక విద్యాభ్యాసం జరిగింది. మా నాన్న స్కూల్ అసిస్టెంట్ (సైన్స్ టీచర్) మాకు అద్భుతంగా, ప్రయోగాత్మకంగా పాఠాలు భోదించేవారు. మాకు కప్పను, తొండను, బొద్దింకను డిసెక్షన్ చేసి చూపించేవారు. పాఠం ఓ సారి విన్నామంటే పుస్తకం చూడాల్సిన అవసరం లేదు. క్రమశిక్షణ, వృత్తి నిబద్ధత, అంకిత భావం, సమయపాలనకు ప్రతిరూపం ఆయన. ఎందరో విద్యార్థులు నేడు అత్యున్నత రంగాలలో దేశ, విదేశాలలో రాణిస్తున్నారు. వారందరికీ మా నాన్న స్ఫూర్తి. ప్రముఖ పాటల రచయిత కె. చంద్రబోస్ కూడా మా నాన్నగారి శిష్యుడే.

చిట్యాలలో యం.ఈ.ఓగా, సంగం మండలం విద్యాధికారిగా పనిచేసి రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ఎమ్.ఇ.ఓగా అవార్డ్ అందుకున్నారు. ఆ సమయంలోనే క్యాన్సర్ వ్యాధితో చికిత్స పొందుతూ మరణించినారు.

నేను కూడా ఆయన్నే ఆదర్శంగా తీసుకుని సుమారు 14 సం॥ల నుండి ప్రభుత్వ టీచర్‌గా పనిచేస్తూ జిల్లా, రాష్ట్ర స్థాయిలలో ఉత్తమ ఉపాధ్యా అవార్డులు అందుకున్నాను. నాన్నగారిని ఎరిగిన వారు ఎక్కడ, ఎవరు కలిసినా ఆయనకున్న మంచిపేరు ప్రస్తావిస్తూ, స్ఫూర్తి కథనాలు చెపుతుంటారు. మా నాన్నే నాకు స్ఫూర్తినిచ్చిన గురువు.

– కామిడి సతీష్ రెడ్డి, కర్కపల్లి, గణపురం, వరంగల్ జిల్లా

ఆయనే మా మార్గదర్శి

నా పేరు చరణ్. గడీల సుధాకర్ రెడ్డి అనే ఉపాధ్యాయుడు నాకు బాగా నచ్చారు. ఎందుకంటే ఆయన పాఠం చాలా బాగా చెప్తారు. రోజూ చెట్లను నాటుతాం. వాటికి నీళ్ళు పోస్తాం. మా పాఠశాలలో 15 మంది టీచర్లు ఉన్నారు కాని ఒక్కరైనా ఒక్కసారి కూడా చెట్లకు నీళ్ళు పోయలేదు. విద్యార్థులందరం కలిసి నీళ్ళు పోస్తుంటే సుధాకర్ సార్ వచ్చి మాతోపాటు చెట్లకు నీళ్ల పోసేవారు. మేం ప్లే గ్రౌండ్‌ను శుభ్రం చేస్తుంటే ఆయనా వచ్చేవారు. అంతేకాదు బాగా చేసేవారికి పెన్నులు, పెన్సిళ్ల వంటివి బహుమతులుగా ఇస్తారు. పైగా మాతోపాటే మధ్యాహ్న భోజనం చేస్తారు. ఆయన రోజూ వార్తా పత్రిక తీసుకొచ్చి తను చదవి వినిపించడంతో పాటు పిల్లలకు అవసరమైన వాటిని విద్యార్థులతోనూ చదివించేవారు.

ఆదివారం వస్తే వాళ్లింటికే విద్యార్థులందరూ వెళ్లేవాళ్లు. ఆయన్ని ఒక్కరోజు కూడా వదిలేవాళ్ల కాదు. వాళ్లింటికి వెళ్లినప్పుడు మంచి మంచి పుస్తకాలు ఇచ్చేవారు. అన్నిటికీ ఆయనే మాకు మార్గదర్శి. ఆయన ఏదైనా మీటింగ్‌కి వెళ్తే తనతో పాటు మమ్మల్నీ తీసుకెళ్లి పరిచయం చేసేవారు. ఆయనంటే నా ఒక్కడికే కాదు, నా సహ విద్యార్థులందరికీ ఇష్టం. ఇంకా చెప్పాలంటే ప్రాణం.

– ఎర్రోల్ల చరణ్, 8వ తరగతి, తొగుట

స్ఫూర్తినిచ్చిన గురువు ఎవరు?

బడికి వెళ్ళినప్పట్నించి కాలేజీ దశ వరకు ఎందరో ఉపాధ్యాయులు మనకు పాఠాలు బోధిస్తారు. వారిలో కొంతమంది గుర్తుండిపోతారు. కొందరు గొప్ప స్ఫూర్తిని ఇస్తారు. వారు చెప్పిన పాఠాలుగానీ, కొన్నిమంచి మాటలు గానీ మనసులో ముద్రించుకుపోతాయి. ఆవిధంగా మిమ్మల్ని ప్రభావితం చేసిన ఉపాధ్యాయుల గురించి ఈ శీర్షికకి రాయండి. మీకు స్ఫూర్తినీ, ఉత్తేజాన్నీ ఇచ్చి ప్రోత్సహించిన ఉపాధ్యాయుల్ని ఈ శీర్షిక ద్వారా గుర్తు చేసుకోండి.

మీ రచనతో పాటు ఫోటో కూడా పంపండి. 'సోపతి'లో ప్రచురిస్తాం.

చిరునామా: సోపతి, ప్రజాశక్తి ఆదివారం సంచిక, ప్రజాశక్తి తెలుగు డైలీ, 21/1, ఎమ్.హెచ్.భవన్, అజామాబాద్, ఇండస్ట్రియల్ ఏరియా, బాగలింగంపల్లి, హైదరాబాద్-20

రచయితలకు సూచనలు

✎ 'సోపతి' కోసం వ్యాసాలు, కథలు, కవితలు పంపించండి.

✎ కథకు పేజీల పరిమితి లేదు. కథ అయి వుండాలి, అంతే! చదివించే గుణమే ప్రధానం.

✎ అనువాద కథ, కవితలు కూడా పంపించవచ్చు. మూల రచయిత అనుమతి పత్రం తప్పనిసరి.

✎ యాత్రా కథనాలకు ప్రత్యేక ప్రాధాన్యం. మీరు చూసి వచ్చిన ప్రదేశాల గురించి, మీ అనుభవ నేపథ్యంలో రాసి, తగిన ఫోటోలతో పంపించండి.

✎ రచనల్ని తిప్పి పంపాలనుకునేవారు తగిన స్టాంపులున్న కవర్‌ని జత చేయాలి.

✎ రచనతో పాటు రచయిత అడ్రసు ఉండాలి.పిన్‌కోడ్ నెంబరు తప్పనిసరి అవసరం. మీ ఫోను నెంబర్, వీలయితే ఈమెయిల్ కూడా ఇవ్వడం మంచిది.

✎ రచనల ప్రచురణకు సంబంధించి ఫోన్లలో ఎలాంటి సంప్రదింపులకు తావు లేదు.

✎ ఆరోగ్యకరమైన హాస్య, వ్యంగ్య రచనలకు ప్రాధాన్యం వుంటుంది.

✎ సమీక్షకోసం పుస్తకాలు పంపేవారు రెండు ప్రతులు పంపించాలి.

చిరునామా: సోపతి, ప్రజాశక్తి ఆదివారం సంచిక, ప్రజాశక్తి తెలుగు డైలీ, 21/1, ఎమ్.హెచ్.భవన్, అజామాబాద్, ఇండస్ట్రియల్ ఏరియా, బాగలింగంపల్లి, హైదరాబాద్-20

నెమలీక

మీకు తెలుసా?

– మనం ఆహారం తినడానికి కొన్ని నిముషాలు చాలు. కానీ అది జీర్ణం కావడానికి కొన్ని గంటల సమయం పడుతుంది.

– హిమోగ్లోబిన్ నుండి ఆక్సిజన్ అన్ని శరీర భాగాలకు సరఫరా చేయడంలో ఐరన్ ముఖ్యపాత్ర వహిస్తుంది.

– మనం వాడే యాంటిబయాటిక్ మందులు మన శరీరంలోని బ్యాక్టీరియా మీద పనిచేస్తాయి కానీ వైరస్ మీద పనిచేయవు.

– వైరస్ కంటే బ్యాక్టీరియా వంద రెట్లు పెద్దగా ఉంటాయి.

– మనం పీల్చే గాలిలో పావు వంతు మన మెదడే ఉపయోగించుకుంటుంది.

– మన గుండె రోజుకు లక్ష సార్లు కొట్టుకుంటుంది.

– శరీర రంగు మనలో ఉండే మెలనిన్ అనే పదార్థం మీద ఆధారపడి ఉంటుంది. మెలనిన్ తక్కువగా ఉంటే గోధుమ రంగులో, ఎక్కువగా ఉంటే నలుపు రంగులో శరీరం ఉంటుంది.

– మనిషి శరీరంలోని అతి చిన్న ఎముక పొడవు 2.8 మి.మీ. అది మధ్య చెవిలో ఉంటుంది.

– మనిషి శరీరంలోని ఎడమవైపు భాగాన్ని కుడివైపు ఉన్న మెదడు, కుడివైపు శరీర భాగాన్ని ఎడమవైపు మెదడు కంట్రోల్ చేస్తాయి.

ఎవరెవరు కవలలు?

ఇక్కడ ఎనిమిది మంది కవలలున్నారు. వాళ్లు ఎవరెవరో కనిపెట్టండి.



జవాబు : 1-8, 2-13, 3-14, 4-12, 5-11, 6-16, 7-10, 9-15

తేడాలెక్కడ?

పక్కనున్న ఈ రెండు బొమ్మలు చూడ్డానికి ఒకేలా కనిపిస్తున్నా వాటి మధ్యలో 5 తేడాలున్నాయి. అవి ఎక్కడెక్కడ ఉన్నాయో గుర్తించండి.



నీడ ఏది?



ఇక్కడున్న ప్రాణుల పక్కనే వాటి నీడలు కూడా ఉన్నాయి. దేని నీడ ఏదో చెప్పేయండి.

జవాబు : అ-3, ఆ-2, ఇ-1, ఈ-9, ఉ-5, ఊ-4, ఋ-8, ఎ-7, ఏ-6

రంగులద్దుదామా...

ఈ పప్పీ భలేగా ఉంది కదా! దీనికి రంగులు వేసి ఇంకా బాగుంటుంది కదా. మరెందుకాలస్యం కలర్స్ దగ్గర పెట్టుకోండి.

చుక్కలు కలుపుదాం

హేళన వద్దు



కిరణ్ కొంచెం బొద్దుగా ఉంటాడు. శరీరం భారీగా వున్నందువలన, బరువు దగ్గడానికి వ్యాయామం చేస్తుండేవాడు. ఎంత వ్యాయామం చేసినా ఒళ్లు తగ్గేది కాదు. అందరిలో తను ప్రత్యేకంగా కనిపించడం, అందరూ తనని వింతగా చూడడం కిరణ్‌కి ఇబ్బందిగా ఉండేది. అయినా ఆ బాధని మనసులోనే దాచుకుని, బరువు తగ్గడానికి స్నేహితులు, బంధువులు ఇచ్చిన సలహాలను పాటిస్తుండేవాడు.

ఎప్పటిలాగే ఓ రోజు కిరణ్ తన స్నేహితులతో కలసి వ్యాయామం చేయడానికి పార్క్‌వైపు వెళుతున్నాడు. వాళ్లకి ఎదురుగా ఇద్దరు వ్యక్తులు వెళ్లూ కిరణ్‌ని చూసి నవ్వారు. అయినా ఇది మామూలే కదా అని కిరణ్ ఏమీ మాట్లాడకుండా వెళ్తున్నాడు.

కానీ ఆ ఇద్దరు వ్యక్తులలో ఒకతను "మనం దారి తప్పి అడవిలోకి రాలేదు కదా' ఎగతాళిగా అన్నాడు. దానికి రెండో వ్యక్తి 'ఎందుకు అలా అడుగుతున్నావు?' అన్నాడు ఇంకాస్త వెటకారంగా. మళ్లీ మొదటి వ్యక్తి 'ఏం లేదు. ఇందాక ఓ గున్న ఏనుగు కనిపిస్తేనూ, అడవిలో ఉన్నామేమో అని అనుమానమొచ్చిందిలే' అన్నాడు.

ఈ మాటలన్నీ విన్న కిరణ్ స్నేహితులు వారికి తగిన సమాధానం చెప్తామని ముందుకు వెళ్లబోయారు. కిరణ్‌కి కూడా చాలా బాధ అనిపించింది. కానీ వెంటనే తేరుకుని తన స్నేహితులతో 'మనుషులకైతే బుద్ధి చెప్పొచ్చు. కానీ ఇక్కడేమో పశువులు అరుస్తున్నాయి. మనం దారి తప్పి పశువులు ఉండే చోటుకి వచ్చినట్లున్నాం. పదండి పోదాం' అంటూ బయల్దేరారు. ఈ మాటలు విన్న ఆ ఇద్దరు వ్యక్తులు సిగ్గుతో తలవంచుకుని వెళ్ళిపోయారు.

■ కొత్త సీరియల్

ప్రేమ - విప్లవం

మూలం : మేరీ గాబ్రియేల్

స్వేచ్ఛానువాదం: ముక్తవరం పార్థసారథి, ఫోన్: 91776 18708

(గతవారం తరువాయి)

తనలో ఏదో మార్పు వస్తోంది. ఈ పరిస్థితి గురించి మొదటి సంవత్సరంలోనే తండ్రికో లేఖ రాశాడు కార్ల్ :

'డియర్ ఫాదర్,

మిమ్మల్ని వదలి వచ్చినప్పుడు నా ముందు ఓ కొత్త లోకం ఆవిష్కృతమైంది. అది ప్రేమ లోకం. ఇంకా నేను చేరుకోలేని ఓ ప్రేమ లోకం. బెర్లిన్‌కు రావటం ఒక అద్భుతమైన అనుభవంగా మిగలాలి. కానీ అది కూడా నాకు ఆనందం ఇవ్వలేదు. శిలగా మారిన నా మనసుకన్నా కరకు శిలలేమీ నాకు దారిలో కనిపించలేదు. భోజనం రుచించటం లేదు. జెన్నీ కన్నా అందమైనదీ, ముఖ్యమైనదీ మరేదీ లేదీ

లోకంలో. ఇదీ నా ప్రస్తుత పరిస్థితి'.

అప్పటి మార్క్స్ ఆలోచనలు ఎంత అల్లకల్లోలంగా ఉన్నాయో స్పష్టమౌతూనే ఉంది. కవిత్వం రాయాలనుకుని జెన్నీ కోసం మూడు సంపుటాలు రాశాడు. 'అయినా, నా ప్రేమను వ్యక్తం చెయ్యటానికి ఏ మాత్రం సరిపోదు' అని రాశాడు. ఆ తర్వాత, 'లా' పుస్తకాలు 'క్లాసిక్స్' ముగించాడు. 'శిక్షాస్మృతి' 'మతపరమైన న్యాయశాస్త్రం' అధ్యయనం చేశాడు. 'ప్రాచీన రోమన్ సివిల్ లా' అనువాదం చేశాడు. మూడువందల పేజీలు 'ఫిలాసఫీ ఆఫ్ లా' రచించాడు. గ్రీకు నుండి అరిస్టాటిల్ రాసిన 'రెటారిక్' చరిత్రకారుడు టాసిటస్ రాసిన 'జెర్మానియా', కవి ఓవిడ్ రాసిన 'సాంగ్స్ ఆఫ్ శాడ్‌నెస్'లను లాటిన్ నుండి అనువదించాడు. ఇంగ్లీషు, ఇటాలియన్ నేర్చుకున్నాక 'ఒక వ్యంగ్య నవల 'స్కార్పియ ఆన్ అండ్ ఫెలిక్స్' రాశాడు. గోతే 'ఫాస్ట్ ప్రేరణతో 'ఊలానెమ్' అనబడే నాటకం ముగించాడు. ఆ తర్వాత 'పెద్దగా సాధించిందేమీ లేదు' అని రాసుకున్నాడు.

అయితే, ఇంతటి తీవ్రమైన కృషి ఫలితంగా... అతని మానసిక, శారీరక ఆరోగ్యం దెబ్బతింది. నగరం వదిలి పల్లెపట్టులలో ప్రశాంతంగా తిరిగి రమ్మన్నాడు డాక్టర్. సలహా నచ్చింది. రివర్ స్ప్రీ తీరాన వున్న స్ట్రాతా గ్రామానికి వెళ్లి ఫిషింగ్‌లో కొంతకాలం గడిపాడు. అక్కడే ఉండటానికి వసతి కూడా దొరికింది. ఇంటి యజమానితో కలసి వేటకెళ్లాడు. అక్కడున్నప్పుడే తండ్రి రాసిన లేఖలో 'నేను అనారోగ్యంతో బాధపడుతున్నప్పుడే హెగెల్‌ను మొదటి నుండి చివరిదాకా చదివాను. అతడి శిష్యుల గురించి కూడా తెలుసుకున్నాను' అని పేర్కొన్నాడు. అప్పటికి హెగెల్ మరణించి ఆరేళ్లయింది. అక్కిడి ప్రొఫెసర్లలో, విద్యార్థుల్లో ఆయన ప్రభావం కొంత తగ్గింది. కార్ల్ మార్క్స్ మేథో ప్రస్థానంలో హెగెల్‌ను దాటి ముందుకు పోక తప్పదు.

'మానవ జాతి చరిత్రంతా సంఘర్షణల, పోరాటాల మయమే' అన్నది హెగెల తాత్వికతకు ప్రాతిపదిక. రెండు ఆలోచనలు సంఘర్షించినప్పుడు మూడో ఆలోచన పుడుతుంది. అది మరో ఆలోచనతో సంఘర్షిస్తుంది. అంటే నిరంతర మార్పు జీవన స్వభావం ఇది. ఇది అనివార్యమని గ్రహించిన హెగెల్ దీన్నే 'గతితార్కికత' అన్నాడు. ఈ గతితార్కికత క్రమం, బిగువు (tension) మీద ఆధారపడి ఉంటుంది. ఇవి అవసరం కూడా. ఎందుకంటే చరిత్ర ప్రగతికి సంఘర్షణ అనివార్యం. హెగెల్ గతితార్కికత, సంఘర్షణకు ఓ కొత్త అర్థమిచ్చింది. ఎంగెల్స్ మాటల్లో 'చరిత్రంతా అర్థంలేని హింసాత్మక సంఘటనల క్రమంలా కాక ఒక అర్థవంతమైన పరిణామ దశలుగా కనిపిస్తుంది. హెగెల్, ఆత్మ (spirit) అనే మరో అంశాన్ని కూడా ప్రవేశపెట్టాడు. చారిత్రక పరిస్థితులలో ఇది ఒక సమూహానికి చెందిన ప్రజలందర్లో ఉంటుంది. వ్యక్తి తనను తాను చరిత్రలో భాగం కానని, తన కృషికందులో భాగం లేదనుకున్నప్పుడు దీని ప్రత్యామ్నాయం. 'పరాయీకరణ' అతణ్ణి ఆవహిస్తుంది.

ఆరోజుల్లో హెగెల్ తాత్విక భానవలు జర్మనీలోని మేధావులందర్నీ ప్రభావితం చేశాయి. డజన్లకొద్దీ హెగెలియన్లు నిరంతరం చర్చించి కొత్త విషయాలు ఆవిష్కరించటానికి ప్రయత్నించారు. మరి, హెగెల్ స్వయంగా బోధించిన బెర్లిన్ యూనివర్సిటీలో వాతావరణం మరెంత ఉద్రిక్తంగా ఉండేదో ఊహించుకోవాల్సిందే. అక్కడి యువ మేధావులు, ప్రొఫెసర్లు సంస్కరణలు కావాలన్నప్పుడల్లా వాళ్ల నోరు నొక్కేశారు. స్వేచ్ఛ తగ్గింది. ప్రభుత్వం యధాతథ స్థితి వైపే మొగ్గు చూపింది. వాళ్ల సరిహద్దుల కావల 'బెల్జియం, ఫ్రాన్సు, ఇంగ్లాండులలో రాజకీయ, ఆర్థిక, రంగాలలో పెను మార్పులు వస్తున్నాయి. అక్కడ ప్రభువులు ప్రజలకు స్వేచ్ఛనివ్వటమే అందుకు కారణమని వాళ్లకు తెలుసు. ఉక్కును రైలు పట్టాలుగా మార్చారక్కడ. వాటిమీద గంటకు అరవైమైళ్ల వేగంతో రైళ్లు పరిగెడుతున్నాయి. విద్యుచ్ఛక్తి తళుక్కుమంటోంది. టెలిగ్రాఫ్ ద్వారా సమాచార వ్యవస్థలో విప్లవం వచ్చింది. హెగెల్ బోధనల ప్రకారం ఇదంతా ఘర్షణ ఫలితమే. సంఘర్షిస్తే పెనుమార్పు - సామాజిక విప్లవం కూడా వస్తుంది.

యూరోపియన్ మేధావులందర్నీ ఆకర్షించిన అయస్కాంతం బెర్లిన్. కేవలం జర్మనులే కాదు, భూస్వామ్య వ్యవస్థ కింద మగ్గిపోతున్న రష్యన్లు కూడా అక్కడికే చేరుకుంటున్నారు. 'విశ్రాంతి' ముగించుకుని బెర్లిన్ తిరిగి వచ్చిన కార్ల్ బొహీమియన్ డాక్టర్స్ క్లబ్‌లోని యంగ్ హెగెలియన్ల బృందంలో చేరాడు. అక్కడ అతడికిష్టమైన రెండు పనులు నిరాటంకంగా కొనసాగించవచ్చు. ఒకటి తాత్విక చర్చలు. రెండవది తాగుడు.

బెర్లిన్‌లోని తొలి నెలల్లో మార్క్స్ ఎంత నైరాశ్యం అనుభవించాడో, అంతకన్నా ఎక్కువ అనుభవించింది జెన్నీ. తల్లిదండ్రుల మనసు గాయపర్చవద్దని, ఇద్దరూ ఉత్తరప్రత్యుత్తరాలు మానుకున్నారు. కానీ సమాచారం తెలియకపోవటంలో, ఆమెలో అసూయ పెరిగింది. కార్ల్ తనను అశ్రద్ధ చేస్తున్నాడు. బెర్లిన్ మహానగరంలో తను అతడికి ఇంకా గుర్తుంటుందా! ఇలా బెంగపెట్టుకుని జబ్బు పడింది. ఇది కేవలం శారీరకమనుకున్నారు ఆమె తల్లిదండ్రులు. కానీ జెన్నీది 'డిప్రెషన్' అని హైన్రిష్ మార్క్స్‌కు తెలుసు. జెన్నీ తల్లిదండ్రులకు తెలియకుండా ఇద్దరూ రాసుకున్న లేఖల్ని ఒకరినొకరికి చేర్చిన తనకు జెన్నీ పడిన బాధ తెలుసు. ప్రతిసారీ కొడుక్కు 'ఆమె నీ కోసం చేసిన త్యాగం అమూల్యం. సంఘంలో ఆమె

గౌరవం నిలబెట్టే బాధ్యతనీదే. ఈ బాధ్యత విస్మరిస్తే నువ్వు క్షమార్హుడివి కాదు...' అని రాశాడు.

మూడు సంపుటాల కవితలతో జవాబిచ్చాడు కార్ల్. 1836 క్రిస్మనాటికి అవి ఆమెకు కానుక. మొదటి రెండు ఆసక్తులకూ బుక్ ఆఫ్ లవ్' అనీ, మూడో దానికి 'బుక్ ఆఫ్ సాంగ్స్' అనీ పేరుపెట్టాడు. ఈమెకు పుస్తకాలూ' నా శాశ్వత ప్రేయసి జెన్నీ వాన్‌వెస్ట్‌ఫాలెన్'కు అంకితం' ఈ పుస్తకాలను పదిలంగా దాచుకున్న జెన్నీ, కార్ల్ ప్రేమోద్ధృతాన్ని చూసి తనలోతానే నవ్వుకుంది. కానీ ఆ డిసెంబరులో వాటిని చేతిలోకి తీసుకుని స్పృశించినప్పుడు కన్నీరుబికి వచ్చింది. 'జెన్నీ నెమ్మదిగా తన తల్లిదండ్రులకు నచ్చజెబుతుందిలే' అని తన సోదరుడికి హామీ ఇచ్చింది సోఫీ.

అయితే, జెన్నీకి అదంత సులభమేమీ కాదు. ఈ కాలంలో ఆమె రాసిన లేఖలేవీ లభ్యం కావటం లేదు గాని, హైన్రిష్ మార్క్స్, కార్ల్‌కు రాసిన ఉత్తరాల ద్వారాకొంత సమాచారం తెలుస్తుంది. ఒకవైపున ఉద్యోగం త్వరగా సంపాదించుకొమ్మని చెబుతూనే, జెన్నీ మనసు గాయపరచవద్దంటూ కొడుకును హెచ్చరించాడు. హైన్రిష్‌కు కొడుకంటే ప్రేమ ఉన్నమాట నిజమేకాని, జెన్నీలాంటి సంస్కారవంతురాలు, సౌందర్యవతి, గమ్యం లేకుండా తిరుగుతున్న యువకుణ్ణి ఇష్టపడుతున్నది. 'కనీసం ఆమె కోసమైనా క్రమశిక్షణతో బతుకు' అంటూ పలుసార్లు హెచ్చరించాడు' ఆమె సంతోషానికే జీవితం వెచ్చించాలి.'

కార్ల్, జెన్నీని ప్రాణం కన్నా ఎక్కువ ప్రేమించిన మాట నిజమే గాని, యూనివర్సిటీలో, యంగ్ హెగెలియన్లతో అతడి జీవితం పెనవేసుకుపోయింది. ప్రియురాలి ప్రేమ కోసం దహించుకుపోతున్నాడు. కానీ మేధో జీవితం, చర్చోపచర్చలు అతడికి ఊపిరిసలపనివ్వటం లేదు. మార్క్స్ జీవితమంతా రెండు పార్శ్వాలు అతణ్ణి శాసించాయి. ఒకటి ప్రేమ లోకం. మరొకటి మేధో మధనం.

మార్క్స్ మొదట అడాల్ఫ్ రూటెన్‌బర్గ్ అనబడే జాగ్రఫీ ప్రొఫెసర్ వద్ద శిష్యరికం చేశాడు. ఈ రూటెన్‌బర్గ్ అప్పటికే ఒక వార్తాపత్రికలో కొన్ని వివాదాస్పద వ్యాసాలు రాశాడు. ఆ తర్వాత ఒక రాడికల్ మత శాస్త్రాచార్యుడు బ్రూనోబార్ ప్రభావంతో కొన్నాళ్లున్నాడు. 'భగవంతుడు ఒక హేతుబద్ధమైన శక్తి. అతడే గతితార్కిక చారిత్రక చోదకుడు' అనబడే హెగెల్ అభిప్రాయంతో, వాంగ్ హెగెలియన్లు విభేదించారు. మనిషి తన చరిత్రను తనే నిర్మించుకుంటాడు. ఏ అదృశ్యశక్తీ అతడికి దారి చూపించటం లేదన్నది వీళ్ల వాదన. అయితే, ఈ వాదన పరిణామాలు ప్రమాదకరంగా ఉండే అవకాశం లేకపోలేదు.

దేవుడు చరిత్రగతిని శాసించటం కావని అంగీకరిస్తే, ప్రభువులు దైవాంశ సంభూతులు కారన్నమాట. మరి, రాజు మానవాత్ముడే అయితే, ఇతర్లు అతడి అధికారాన్ని ప్రశ్నించటానికి, ఎదిరించటానికీ అర్హులే.

రాజకీయపరంగా డైనమైట్ లాంటి వాదన ఇది. పందొమ్మిదేళ్ల మార్క్స్ వీటిని ఆసక్తిగా గమనించాడు. ఈ చర్చా బృందాలలో, తనకన్నా పదేళ్లు పెద్దవాళ్లైన సీనియర్ ప్రొఫెసర్లు కూడా అతణ్ణి సమవుజ్జీగా అంగీకరించారు. ('రూసో, వోల్టేర్, హైన్, హెగెల్ కలిస్తే ఒక మార్క్స్ అవుతాడు' అన్నాడో సీనియర్ ప్రొఫెసర్) ఈ చర్చలో. మార్క్స్, ఒక రాజీపడని ఖచ్చితమైన వాదనా ధోరణిని అలవర్చుకున్నాడు. పరిణామ ఫలితంగా అనేకమంది శత్రువులు కూడా తయారయ్యారు. కొన్ని దశాబ్దాల తర్వాత 'మార్క్సిజం'గా పిలువబడిన భావజాలానికి ఆ వాదనలే బీజాలు. ఈ సమయంలో మార్క్స్‌కు అగ్నికీలల మీద నడుస్తున్నట్టుగా ఉండి ఉంటుంది. లుడ్విగ్ వాన్ వెస్ట్‌ఫాలెన్‌తో కలిసి చర్చించిన ఊహాజనిత సోషలిస్టుల అభిప్రాయాలు, ఈ చర్చలతో పోల్చితే, పిల్లల కథల్లా వున్నాయి.

ఈ కాలంలో మార్క్స్‌కు మౌర్ అని మారు పడింది. తెలిసినవాళ్లందరూ అతణ్ణాపేరుతోనే పిలిచారు. నల్లటి జుత్తూ, చామనచాయ రంగులో ఉన్న చర్మానికే గాక, హిల్లర్ 'రాబర్స్' నాటకంలోని పాత్ర 'కార్ల్ వాన్‌మూర్'కు కూడా ఈ పేరు (mour) సంకేతం. జీవితమంతా అతని మిత్రులందరికీ అతడు mour

బెర్లిన్ యూనివర్సిటీ మేధావుల్లో మార్క్స్ ప్రముఖ పాత్ర పోషించినా, మార్క్స్ గురించి, తండ్రికి మాత్రం సదభిప్రాయం లేదు. కుటుంబానికీ, తనకూ మధ్య ముఖ్యంగా, జెన్నీతో కూడా దూరం పెరిగిపోతున్నదని బాధపడ్డాడు. ఇక కొడుక్కి ఎవరూ పట్టరా! ఆగస్టు 1837లో రాసిన ఒక లేఖలో, ఇంటిని పూర్తిగా విస్మరించినందుకు ముఖ్యంగా పదకొండేళ్ల చిన్నకొడుకు ఎడ్వార్డ్ అనారోగ్యంతో వున్నా పట్టించుకోనందుకు మూడు నాలుగు నెలల తర్వాత ఎడ్వార్డ్ మరణించాడు. తల్లి బెంగపెట్టుకుంది. ఏడెనిమిది నెలలపాటు తండ్రి జబ్బుపడ్డాడు. ఒకసారి, కొడుక్కు కుటుంబం పట్ల వుండే బాధ్యతల్ని గుర్తుచేస్తూ మరో లేఖ రాశాడు. అందులో మొదటి అంశం :' నవ యువకుడిగా జెన్నీకి మంచి భవిష్యత్తునివ్వటం నీ బాధ్యత. అంటే ఈ ప్రపంచంలో మంచి భవిష్యత్తు. అంతేకాని, పొగాకు పొగలతో నిండిన గదుల్లో, దీపం వెలుగులో విశృంఖలంగా ప్రవర్తించటం కాదు." మరో విషయం కూడా గుర్తు చేశాడు. జెన్నీ తండ్రికి నువ్వు కృతజ్ఞుడిగా ఉండాలి. ఎన్ని అడ్డంకులున్నా, ఆ మహానుభావుడు మీ పెళ్లికి అంగీకరించాడు. నిజానికి ఏ తల్లిదండ్రులూ ఇలాంటి సంబంధాన్ని హర్షించరు. కొన్నిసార్లు నాకే అనిపించింది. అంతమంచి పిల్లను చేసుకునే అర్హత నీకుందా అని!"

తండ్రికి, కొడుకు పట్ల కోపం రోజురోజుకు పెరిగింది. వాడికి మేమంటే గౌరవం లేదు అన్నాడు. మరోసారి కార్ల్ లేఖను తిప్పి పంపిస్తూ 'పిచ్చిరాతలతో ప్రతిభను వృధా చేసుకుంటున్నావు. రాత్రంతా నువ్వు కూర్చుని సృష్టిస్తున్నది ఈ దయ్యం పిల్లలనా?" అనీ చీవాట్లేశాడు.

'ఒక సంవత్సరంలో, అత్యంత సంపన్నుడి కన్నా ఎక్కువ ఖర్చుపెట్టావు. దానికో కొత్త సిద్ధాంతం కనుక్కోంటున్నానని చెప్పి రాసినవన్నీ చింపేస్తున్నావు.

రాజకీయపరంగా డైనమైట్ లాంటి వాదన ఇది. పందొమ్మిదేళ్ల మార్క్స్ వీటిని ఆసక్తిగా గమనించాడు. ఈ చర్చా బృందాలలో, తనకన్నా పదేళ్లు పెద్దవాళ్లైన సీనియర్ ప్రొఫెసర్లు కూడా అతణ్ణి సమవుజ్జీగా అంగీకరించారు.

అలాంటి నీకు చిన్న చిన్న విషయాలేం గుర్తుంటాయి. చెప్పు? అంటూ వ్యంగ్యంగా దెప్పిపొడిచాడు మరోసారి.

తను మరణానికి దగ్గరగా వున్నానన్న భయంతో హైన్రిష్ నిస్పృహ, కోపం మరింత పెరిగింది. ఆశలన్నీ కొడుకు మీదే పెట్టుకున్నాడు. కానీ అవి నెరవేరే అదృష్టం తనకు లేదు. ఫిబ్రవరి 1838లో రాసిన చివరి ఉత్తరంలో 'నువ్వే నా సర్వస్వం' నీ మీదే నా ఆశలన్నీ అందుకే నువ్వంటే నాకు అప్పుడప్పుడూ చిరాకు, కోపం.కాని ఇక టైం లేదు. అలసిపోయాను. నీ కోసం నిరీక్షించినా ఫలితం లేదు. ఇదే నా చివరి ఆలింగనం' అంటూ..

ఈస్టర్ పండగకు కూడా ట్రేయర్‌కు రావాలనుకోలేదు. అప్పటికే ఒక సంవత్సరంలో తండ్రి సంపాదించిన దానికన్నా ఎక్కువ ఖర్చు పెట్టాడు బెర్లిన్‌లో. ఈ పరిస్థితుల్లో ట్రేయర్‌కు అయిదు రోజుల ప్రయాణం తలకు మించిన భారమవుతుంది. కానీ దిగజారుతున్న తండ్రి ఆరోగ్యం, తల్లీ చెల్లాయి రాస్తున్న ఉత్తరాలు రాకను అనివార్యం చేశాయి. ఏప్రిల్‌లో ట్రేయర్‌కు వచ్చి మే 7దాకా వున్నాడు. (తన ఇరవయ్యవ పుట్టినరోజు జరుపుకుని వెళ్లాడు). క్షయ, లివర్ వ్యాధులతో మే, 13నాడు మరణించాడు హైన్రిస్ మార్క్స్.

తండ్రి అంత్యక్రియలకు రాకపోవటాన్ని ప్రస్తావిస్తూ, కొందరు చరిత్రకారులు మార్క్సుది 'రాతి గుండె' అన్నారు. ఇది అప్పటి వాస్తవాలను అర్థం చేసుకోవటమే. ఒకవేళ అతడు తిరిగి వచ్చినా అప్పటికీ అంత్యక్రియలు జరిగిపోయి ఉండేవి. పైగా వెళ్లేటప్పుడే, తండ్రి వీడ్కోలు తీసుకున్నాడు కార్ల్. అంతేకాదు జీవితాంతం తండ్రి ఫొటోను, తన కోటు జేబులో దాచుకున్నాడు. నలభై అయిదేళ్ల తర్వాత మార్క్స్ మరణించినప్పుడు, అదే ఫొటోను మార్క్స్ శవపేటికలో పెట్టాడు ఎంగెల్స్.

హైన్రిస్ మరణంతో, ఇంటివద్ద ఇప్పుడు మార్క్సును చీవాట్లేసే వాళ్లూ, కోప్పడే వాళ్లూ, అతడి మీద కోపం తెచ్చుకునేవాళ్లూ ఎవరూ లేరు. ఫిలాసఫీ చర్చలు ఆపి గౌరవప్రదమైన పని ఏదైనా చెయ్యమని ఎవరూ అతణ్ణి హెచ్చరించలేదు కానీ, అతని ఇంటి నుండి కాకపోయినా, మరికొన్ని సీరియస్ హెచ్చరికలు అతణ్ణి చేరాయి. వెస్ట్‌ఫాలెన్ ఇంటి నుండి వచ్చాయవి. అవి హెచ్చరికలు కావు. ఒక రకంగా బెదిరింపులు.

(సశేషం)

■ ఇంటర్వ్యూ

అలుపెరగని పోరుగీతం

భుజమున కిన్నెర చేతుల ఆందెలు
మదిలోన పదములు మహిమగల సిటికేలు
ఉప్పొంగే కన్నీట ఊరేటి రాగాల
దారి పొడవున పంచి దాటి పోతుంటేను
చెట్టుపై చిలుకమ్మ నీ చెలిమి గొరిందా...
కిన్నెరుంటె సాలు బైరాగి సిలక

ఉన్నా...లేకున్నోకటే బైరాగి సిలక గొరేటి పాట రత్నంకు వర్తిస్తుంది.

అతడు పలికించే గమకాలు మరోప్రపంచంలోకి నడిపిస్తాయంటే అతిశయోక్తి కాదు. ఒక్కొక్క వీరగాథ నరనరాల్లో నెత్తురు ఉరకలెత్తిస్తుంది. కంచు కంఠం వింటే మైమరచి పోవల్సిందే ఏనభై యెళ్లొచ్చిన గొంతులో తడి అరలేదు. వన్నె తగ్గలేదు. ఈయన పేరు రత్నం ఉద్యమంలో... తెలంగాణ నాజర్ అయ్యాడు. నా పాటకు ఊరు, పేరు, కులం, ప్రాంతంతో పనేలేదు. ఎక్కడ ఏ మూల బాధాసర్పద్రస్టులు ఉంటారో, అక్కడ, ఎక్కడ పదిమంది గుమికూడి ఉంటారో...అక్కడ అది పండుగా...జాతరా... అంగడా అక్కడ నా ఆట-పాట, నేనొక పాటల బైరాగిని అంటూ 60 ఏళ్ళుగా పల్లె, పట్నం. తండా, గూడెం బుక్కెడు బువ్వ మరో ఊరికి పోవడానికి తోవచార్జీ ఇస్తే... సరి అలా పాటలను మోసుకుంటూ....మోసుకుంటూ అలుపెరుగని పాటల మొక్కలు నాటిన బల్లా రత్నం అలియాస్ తెలంగాణ నాజర్.

ఆయన వెలుగు జిలుగు మైదానంలో పుట్టలేదు. పాడిపంటల నదితీరంలో అడుకోలేదు. డబ్బులతో మనుష్యులను కొలిచే మెట్రో జీవితంలో ఎదగలేదు. అక్కడెక్కడో... నల్లగొండ జిల్లా భువనగిరి పక్కన కుగ్రామంలో దళిత కుటుంబంలో పుట్టినాడు, తెలంగాణలో దొరల ఉక్కుపాదాల కింద నలిగిన ఆ ఊర్లోనే ... నా తల్లిదండ్రులను నైజాం మిలట్రీవొడు తన్నిన తన్నులు. ఆ ఊర్లో అడుగేస్తే ఆణచివేత, నా బాల్యమంత ఆడలేదు, ఒకతాన గూమిగుడి పాడ లేదు. తొచీ తప్ప మారు గొడుగ అంగి లేదు. చింపురు జీవితం. మరోవైపు దొరల దౌర్జన్యం, రజాకార్ల రాక్షసత్వం అందుకేనేమో ఓ బల్లెం పోటులా దూసుకొచ్చిందే పాట... నన్ను ఆటపాటకు దూరం చేసిన దొర, నైజాంకు ఘోరీ కట్టేదాక నా గళం ఆగదు, కాలిగజ్జేలోదలను అని నా మనస్సులో శపథం చేసుకున్నానని అన్నాడు.

పల్లెపాటల్ని బాణికట్టిన, నా కసినంతా గొంతులోపోసిన.. సల...సల కాగే పాటనే ఒక ఆయుధంగా తయారు చేసుకున్నా, నా లాంటి పొరగాళ్ళ తోడు తీసుకున్నా దొరోడికి పాట వినబడనంత దూరాన పాటలు కైగట్టిన, నా కడుపులో నుండి ఎగదన్నుకొచ్చే దు:ఖాన్నంత కథగా మలచినా... సుద్దాల హన్మంతు పాటలు చెవినా పడ్డాయి. ఆయన బుర్ర కథ వినాలనీ, స్వయంగా చూడాలనీ 45 కీ.మి. నడిచి చూసోచ్చినా... పల్లెకు ప్రతీకగా గోసి గొంగడి తీసుకొని గొల్ల సుద్దులు చెపుతున్న నర్రా రాఘవరెడ్డిని, లస్కర్ సాబులా మాటల్ని గుదిగుచ్చి నేర్చుకున్న నాజర్ దళం. బుర్రకథ నెల్లూరుకు పోయి చూసినా ... అరుట్ల రామచంద్రారెడ్డి, కమలాదేవి, మల్లు స్వరాజ్యం, భీంరెడ్డి నర్సింహారెడ్డి, నల్లా నర్సింహులు, కాచం కృష్ణమూర్తి మాటలు విన్నా. వారి పౌరుషాన్ని నాలో నింపుకున్న నాతోటి పాటగాళ్ళు పాండురంగం, కిట్టయ్య, చంద్రన్న, నరహరితో కల్సి చంకల సంచి, గొంతులో పాటతో నా పాటల బండి బయల్దేరింది. ఊరు, పేరు, ప్రాంతం మేము అడగలే... పాటతోనే పల్లెను లేపేది, పనులల్లా...పాట, ఎట్టివాడల, మట్టిమనుషుల్ని మర్లబడ్డ వీరులకు ఉపిరయ్యింది. పాట, గాయపడ్డా వారికి “మాలాం” పాట తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటానికి మలుపు పాట బండేనక బండి కట్టి అని పాడిన యాదగిరి పై కక్ష కట్టి కత్తి దూసినా... పాట అగలే. పాటకు జీవం పోసి బతికించినాము. పాట పవర్‌పూల్ వెపన్, అడవుల్లో గెరిల్లా దళం చంకన తుపాకి చేతిలో జెండాతో గ్రామాలను విముక్తి చేసుకుంటూ దళాలు వస్తుంటే మాపాటల్ని తూటాలుగా మలచి దళాల రాకకు ప్రజల్ని సంసిద్ధం చేసినాము. ఇది పసి గట్టిన దొరలు చితక బాదింద్రు, ఇగ సచ్చింద్రు నా కొడుకులు అని వొదిలేసింద్రు, ప్రజలు, మాపాటల్ ... బతికించింది. దొరోడు కొట్టిన దెబ్బలు మానలేదు. నైజాం సైన్యం ఒకవైపు, సంఘపోళ్లు మరో వైపు హోరాహోరిగా యుద్ధం జరుగుతోంది. గ్రామ విముక్తి పోరాటం సాగుతోంది. బోల్లెపల్లికి దళం వస్తుంది పాట ఆగొద్దు పాటకు పర్మిషన్ లేదు. అది దొరోడి ఆజ్ఞా...! బాలనాగమ్మ కథ అంటూ గ్రామ షేక్ సింద్‌కు చెప్పి మయాలా ఫకీర్‌కు వ్యతిరేకంగా బాలవద్ధిరాజు తిరుగుబాటు కథ చెప్పుతుంటే.. ఆ వుళ్ళో దొరోడు జ్ఞాపకమోచ్చి కర్రలు కారం వడిసెలు కదం తొక్కినాయి. ఇంతలో దళం చేరుకుంది. గడిని ముట్టడించినాము. దొరోడు మిలిట్రీ బేంగపాడ్ అయింద్రు. ఇది పాట పవర్ నా గొంతు వింటే ఇనుపగుగ్గిళ్లు నమిలినట్లు ఉండేది. నా బుర్రకథ వినడానికి తండోప తండాలుగా వచ్చేది కథ విన్న జనం వెయ్యి ఎనుగుల బలం నింపుకొని పోయేది. అట్లా ఆంధ్రా, తెలంగాణా, రాయలసీమ అనే తేడా లేకుండా దోపిడి యాడ ఉంటే యాడనే నా ఆట కాకినాడ దగ్గర చంద్రాపురంలో బుర్రకథ విన్న ఆ ప్రజలు నేను వద్దన్న వినకుండా “తెలంగాణ నాజర్” గా సత్కరించారు.

అన్నం, నీళ్ళు దొరకని రోజులేన్నో ఉన్నాయి ఉన్నదాంట్లో పంచుకొని తినేది కాళి కడుపుతో కథ చెప్పినా... కథ విన్న తల్లి కడుపు జూసింది. అలా కథ, కన్నీళ్ళు కల్సిసాగిన జీవితం అయ్యా నాది.

మార్క్సు గురించి చదవలే, సిద్ధాంతం తెలవదు. కాని, కళాకారుడిగా బతకాలి అనుకున్న మనుషులున్న చోట ప్రజలను ఉత్తేజ

పరచాలి, నా ఆట పాటతో నోరు ఆడించాలి. కమ్యూనిస్టుగా నాకు తెల్సినవి రెండు ఆయుధాలు 1. కలం 2. నోరు. ఇవి ప్రజల్లోకి వెళ్ళినప్పుడు శక్తిగా మారుతుంది. కలం పట్టలేదు, చదువులేదు, రాయికొట్టే దళితున్ని పొద్దుదాక రాయి కొట్టోచ్చీ రాత్రి పూట ఆటపాట సాధనజేసేది. ప్రతికొండ కొమ్మనా పల్లె పల్లెన నా జెండా ఎగరాలి

బల్లా రత్నం

తెలంగాణ సంస్కృతి ఒక గిరిజన సంస్కృతి చావైనా, పండుగైనా, సంబరమైన పాటే, మన సంస్కృతిలో బాగమైంది పాట సంస్కృతిని పట్టుకొండి అందులోనే మన గమ్యం, గమనం అర్థమవుతుంది అన్నారు.

ఎర్రజెండా స్ఫూర్తిదాయకం, నాకు ఉత్తేజన్నిచ్చే శౌర్యప్రదాయినీ అటువంటి జెండాను మనం ఎగురవేయకపోతే... అటువంటి పాట మనం పాడకపోతే ఇతరులు మరో పాట, మరో రంగు జెండా లేగరేస్తారు. ఇప్పుడు మన కళాకారులు అన్ని మరిచింద్రు కమర్షియల్ అయింద్రు నాతోటి కళాకారులంత చనిపోయింద్రు, నా కంటే పెద్దాయన నర్రా రాఘవరెడ్డి బతికి ఉన్నాడు. ఇప్పటికి గొసి గొంగడి మొదటగా వేసుకున్నదే ఆయనే. ఇప్పుడు గొసి గొంగడి కట్టుకొని కార్లలో తిరిగే కళాకారు లెక్కువైనారు అని ఆవేదన చెందారు. ఇప్పటికి నేను ఎలాంటి పింఛను తీసుకొలేదు, చివరకు కళాకారుల పింఛన్ కూడా లేదు. 2013 న ఎవరు చెప్పింద్రో కాని హంస అవార్డు రాష్ట్రప్రభుత్వం ఇచ్చింది, "అష్టదరిద్రంల్లోంచి కళాకారుడు పుడతాడు ఖాళీ కడుపు నుండే కవిత్వం పుట్టింది." అందుకోసమే నేను బతుకుతున్న నని అన్నాడు.

నీవు ఇంత గొప్ప కళాకారుడివి వెలుగుల్లోకి ఎందుకు రాలేదు. అని అడుగగా.. నేను అడుక్కోలే నా గురించి పత్రికలో రాయండి, నా గురించి టివిలో చూపండి, అని ఎవర్ని దేవరించలేదు. దళిత సంఘాలన్నీ కల్సి "దళితరత్న" అని బిరుదు ఇస్తాం అని అంటే అక్కర్లేదు దళిత కులం (మాదిగ)లో పుట్టిన నన్ను కులం అడగలేదు, నేను ఎవరికీ చెప్పలేదు అని చెప్పారు. కమ్యూనిస్టు పార్టీలన్ని ఒక్కటిగావాలే అని మొదటినుండి కోరుకుంటున్నాను. తెలంగాణ సంస్కృతి ఒక గిరిజన సంస్కృతి చావైనా, పండుగైనా, సంబరమైన పాటే, మన సంస్కృతిలో బాగమైంది పాట సంస్కృతిని పట్టుకొండి అందులోనే మన గమ్యం, గమనం అర్థమవుతుంది అన్నారు. ఆట, పాట తెలంగాణాకు ఆయుధాలు. వాటిని సంధించడం నేర్చుకొండి. అమర కళావేత్తలను అధ్యయనం చేయండి వారి మార్గాన కళాకారులు ప్రయణించాలని కళాకారులను కోరుకుంటున్నా చివరగా పాట నాకు ప్రాణం ఆ పాట పాడుతునే చచ్చిపోయెలోపు ప్రజాకళాకారుడి గురించి కళాకారులకు చెప్పాలని ఉంది. ఆ అవకాశం కల్పించండి అని అన్నారు.

– భూపతి వెంకటేశ్వర్లు, సెల్ : **9490098343**

వ్యంగ్య వీచికలు ■

మరో డాక్టర్ దగ్గరకు

అప్పుడే ఆఫీసు నుంచి ఇంటికి వచ్చిన భర్తతో భార్య ఇలా అంది:

"ఏమండీ! ఈరోజు నా ఆరోగ్యం బాగోవడం లేదని డాక్టర్ దగ్గరకెళ్ళాను. ఆయన నన్ను పరీక్ష చేసి పెద్ద జబ్బేమీ లేదు. కొంతకాలం ఎక్కడికయినా వెళ్ళి, ప్రశాంతంగా గడిపి రమ్మన్నారు. చెప్పండి మనం ఎక్కడికి వెళ్దాం?"

"ఇంకో డాక్టర్ దగ్గరకు" అన్నాడు భర్త.

మెజీషియన్

సురేష్: నాకు మెజీషియన్ అవ్వాలని వుంది?

రమేష్: ఎందుకు?

సురేష్: ఎవరికీ అనుమానం రాకుండా నా భార్యను అర్జంట్‌గా మాయం చేయాలని వుంది.

సహజీవనం

భార్య: పూర్వం ఆశ్రమాల్లో ఋషులతోపాటు పులులు, మేకలు, పాములు, ముంగిసలు కలిసి వుండేవట. అదెలా సాధ్యమండీ?

భర్త: అప్పటి విషయం ఎందుకు? ఇప్పుడు నేను కలిసి వుండడం లేదా?

మనోవర్తి

జడ్జి: మీ భార్యకు నెలకు మూడు వేల రూపాయలు మనోవర్తిగా మంజూరు చేయాలనుకుంటున్నాను.

భర్త: థాంక్స్ సార్. నేను కూడా కొద్దో, గొప్పో ఇస్తాను లెండి.

మానేస్తున్నారు

ఒక సుప్రసిద్ధ వైద్యుడిని ఇంటర్వ్యూ చేస్తున్నారు ఒక టీవీ ఛానెల్ వారు. అందులో భాగంగా ఇలా అడిగారు:

"జనాభా నియంత్రణలో భాగంగా మీ వంతుగా ఏం కృషి చేస్తున్నారు?"

వైద్యుని జవాబు: బిల్లు ఎక్కువ వేస్తున్నాను. అది చూసి పిల్లల్ని కనడం మానేస్తున్నారు.

ముద్దాయి

"గీత మీద చెయ్యి వేసి చెప్పు... నువ్వు ఆ తప్పు చేయలేదు" అని నిలదీశాడు లాయర్.

"ఒక్కసారి హేమ మీద చెయ్యి వేసినందుకే ఇంతదూరం తీసుకొచ్చారు. ఇప్పుడు గీత మీద చెయ్యి వేయను గాక వేయను" అని బుద్ధిగా చెప్పాడు ముద్దాయి.

■ **సృజన : ముకుందరామారావు**

నోబెల్ అందుకున్న తొలి మహిళ

సాహిత్యంలో నోబెల్ పురస్కారాన్ని అందుకున్న తొలి మహిళ సెల్మా లోగెర్లోఫ్. స్వీడన్‌కు చెందిన ఈ రచయిత్రి బహుళ ప్రక్రియల్లో రచనలు చేశారు. ఆమె రచనలు కాలంతోపాటు ప్రయాణిస్తూ ఈతరం పాఠకుల్ని కూడా చదివిస్తున్నాయి. 1858లో జన్మించిన ఆమె 1940 వరకు జీవించారు. తనదయిన రీతిన సృజనాత్మక జీవితం గడిపారు. స్వీడన్‌కి చెందిన ఆమె రచనలకి మనదేశంలోనూ పాఠకులున్నారు. దాదాపు యాభై భాషల్లోకి ఆమె రచనలు అనువాదమయ్యాయి. తన జీవితకాలంలోని సంప్రదాయాల్ని, ఆధ్యాత్మిక భావాల్ని, మహిళల జీవితాల్లోని భిన్నకోణాల్ని రచనల్లో చిత్రించారు. స్వయంశక్తితో జీవితంలో రాణించి, రచయిత్రిగా పాఠకలోకాన్ని ప్రభావితం చేసిన సెల్మా పరిచయ వ్యాసమిది. సాహిత్యంలో నోబెల్ కవిత్వానికి పురస్కారాలు పొందిన కవుల గురించి పరంపరగా వ్యాసాలు రచించిన ప్రముఖ కవి ముకుందరామారావు గారు 'సోపతి' పాఠకులకు అందిస్తున్న ప్రత్యేక వ్యాసమిది.

ఉత్కృష్టమైన ఆదర్శవాదం, స్పష్టమైన కల్పన, ఆధ్యాత్మిక జ్ఞానం వీరి రచనల్లో ప్రతిఫలిస్తాయని నోబెల్ బహుమతి ప్రదాతలు విశ్వసించిన సెల్మా లోగెర్లోఫ్ 20 నవంబర్ 1858న స్వీడన్‌లోని వార్మ్ లాండ్‌లో జన్మించారు. వీరిని సెల్మా ఒట్టిలీ లోవిస లోగెర్లోఫ్, సెల్మా ఒట్టి గోకెర్లోఫ్ అని కూడా పిలుస్తారు. తండ్రి గుస్తాఫ్ లోగెర్లోఫ్ లెఫ్టినెంట్. తల్లి లౌయిస్ లోగెర్లోఫ్ నవాల్రోథ్ – గృహిణి. ఈ దంపతుల అయిదుగురి సంతానంలో సెల్మా నాలుగో బిడ్డ. తండ్రి, అవ్వ ఎస్టేటు వున్న మర్బకాలో పెరిగారు. ఆ అవ్వ కథలు తనలో రేకెత్తించిన ఆసక్తితో విస్తృతంగా చదువుకుని రచనల పట్ల ప్రేరణ పొందారు. చిన్నతనంలోనే కొన్ని కవితలు, నాటకం సైతం రాశారు. తండ్రి తాగుడుకు బానిస కావడంతో ఆర్థిక ఇబ్బందులు, పుట్టుకతోనే లోపంతో ఉన్న తుంటి బాధపెట్టింది. బాల్యంలో మూడేళ్ళ ప్రాయంలో శైశవ పక్షవాతంతో ఇబ్బంది పడ్డారు. ఆ తర్వాత కొంతవరకు నడవగలిగినా కుంటితనంతో కుంగిపోయారు. రచయిత్రి అన్నా ఫ్రిసెల్జ్ ఆమెను తన విభాగంలోకి తీసుకొని, లాంఛనప్రాయమైన చదువును అభ్యసించడానికి ఆర్థికంగా తోడ్పాటు అందించారు.

1885లో సెల్మా పట్టభద్రులయ్యారు. అదే ఏడాది తండ్రి మరణించడంతో తల్లి దగ్గరకు లాండ్స్ క్రోనాకి వెళ్ళి టీచర్‌గా చేరింది. పదిహేనేళ్ళ ప్రాయంలో ఖాళీ సమయంలో రచనలు చేయడం మొదలెట్టింది. 1890 నాటికి సోఫీ ఆడ్లెర్ స్పర్రె ప్రోత్సాహంతో తొలి నవల 'గోస్తా బెర్లింగ్ వీరగాథ'లోని మొదటి అయిదు అధ్యాయాలకు బహుమతి లభించింది. దానితో, ఉపాధ్యాయ వృత్తిని వదిలేసి నవలని పూర్తి చేసే పనిలో పడ్డారు. రెండు సంపుటాలుగా ఏడాది తరువాత వచ్చిన ఆ నవలకు ఎక్కువమంది విమర్శకుల దగ్గరనుంచి నిరుత్సాహకర సమీక్షలొచ్చాయి. కానీ డెన్మార్క్‌లో ఆ నవలకి దొరికిన సమాదరణతో రచనా వ్యాసాంగాన్ని ఆమె కొనసాగించారు. ఈ నవల ఆమె స్వస్థలం వర్మ్‌లాండ్ చరిత్ర, భాగ్యవంతులైన ఇనుము వ్యాపారులు, చిన్న జాగీరుల, గోస్టా బెర్లింగ్ ఒక ధర్మభ్రష్ట పూజారి నాయకత్వంలో 12 మంది గుర్రపు రౌతులతో సాగిన కరుణరసాత్మక కావ్యరూపం. 19వ శతాబ్దపు థామస్ కార్లయిల్ ప్రభావం ఈ నవల మీద ఎక్కువని భావిస్తారు.

సెల్మా పాఠశాలలో చదువుతున్నప్పుడే అనేకమంది రచయితల్ని చదువుకున్నారు. వారిలో హెన్రీ స్పెన్సర్, థియొడోర్ పార్కర్, చార్లెస్ డార్విన్ లాంటివారున్నారు. వారిని చదువుకుంటున్న క్రమంలోనే మంచితనం, నైతికత పట్ల శ్రద్ధ, సాంప్రదాయిక క్రైస్తవ పిడివాదం పట్ల విముఖత ఏర్పడ్డాయి.

ఆ తర్వాత 1894లో మధ్యయుగ స్కాండినేవియా మరికొన్ని ఆధునిక పరిస్థితుల నేపథ్యంతో సెల్మా రాసిన 'అగోచర లంకెలు' కథల సంకలనం వచ్చింది. మరో రచయిత్రి సోఫీ ఎల్కాన్ 1894లో వీరికి అత్యంత సమీప స్నేహితురాలు, సహచరి అయింది. వీరిద్దరూ ఒకరి ప్రేమలో ఒకరు పడ్డట్టు వారి ఉత్తరాలు తెలియజేస్తాయి. ఒకరినొకరు ఎంత ప్రశంసించుకునేవారో అంత విమర్శించుకునేవారు కూడా. 1895లో పూర్తిస్థాయి రచయిత్రిగా స్థిరపడ్డారు సెల్మా. ఎల్కాన్‌తో బాటు ఇటలీ వెళ్ళారు. అక్కడ క్రైస్తవం, సామ్యవాద నైతిక వ్యవస్థల అన్యోన్య

బాంధవ్యాల్ని అన్వేషించారు. ఇటలీ పర్యటన తరువాత, 1897లో సిసిలీ మీద ఒక సామ్యవాద నవల 'క్రీస్తు విరోధి అద్భుతాలు' రాశారు. ఆమె రచించిన జాగీరు కథల సంకలనం ఉత్తమ రచనగా పేరొందింది. అలాగే 1899-90ల మధ్య ఈజిప్టు, పాలస్తీనాలలో జరిపిన పర్యటనల అనుభవాల సారాంశం ఆమె రాసిన 'జెరూసలెం' నవల. ఇది జెరూసలెంకు వలసపోయిన వారి వృత్తాంతం ఆధారంగా రచించిన నవల. ఇది స్వీడన్‌లో ఆమెకు మంచి పేరు తెచ్చిపెట్టింది. అలాగే ఆమె సృజించిన 'క్రైస్తవ ప్రాచీనకథలు' కూడా పాఠకుల్లో ఆదరణ పొందింది.

సెల్మా, 1904లో ఎల్కాన్‌తో కలిసి స్వీడన్‌లో విస్తృతంగా పర్యటించారు. తర్వాత స్వీడన్ చరిత్ర, భూగోళశాస్త్రం కలగలిపి పిల్లల కోసం ఒక పాఠ్యపుస్తకం రాశారు. ఒక అల్లరి పిల్లవాడు నిల్స్ హోల్గెర్సన్ పెద్ద బాతు వీపు మీద కూర్చుని తిరుగుతూ బాధ్యతాయుతంగా మారడం దీనిలోని ఇతివృత్తం. స్వీడన్‌లోనే కాదు ప్రపంచవ్యాప్తంగా ఆదరణ పొందిన రచన ఇది. అలాగే ఈమె రచించిన 'ఎలకబోను' కథ కూడా అనేకచోట్ల పాఠ్యాంశంగా వుంది. మన దేశంలోనూ ఈ కథని పిల్లలకు ఒక పాఠంగా, ఎన్‌సిఇఆర్‌టి సిలబస్‌లో చేర్చారు.

మొదటి ప్రపంచయుద్ధం సెల్మాను విపరీతంగా కలచివేసింది. ఆ కారణంగా కొన్నాళ్ళు రచనలు చేయడం మానేశారు. 1930లో 'నా బాల్య జ్ఞాపకాలు', 1932లో 'సెల్మా లోగెర్లోఫ్ డైరీ' రచించారు. వీటిలో బాల్యాన్ని గుర్తు చేసుకుంటూ అనేక విషయాల్ని సున్నితమైన కళాత్మకతతో అభివ్యక్తం చేశారు. 18వ శతాబ్దపు చార్లొట్టె లోవెన్ స్కాల్డ్ చరిత్రతో, 1925లో 'లోవెన్ స్కాల్డ్ ఉంగరం' నవల వచ్చింది. ఆ క్రమంలో వార్మ్ లాండ్ సంబంధిత మూడు నవలలు వచ్చాయి. 1904లో 'నిధి', 1913లో 'మార్ష్ క్రాఫ్ట్ నుంచి అమ్మాయి', 1914లో 'పోర్చుగిల్లా చక్రవర్తి', 1918లో 'బహిష్కృతుడు' మొదలైనవి మరికొన్ని పుస్తకాలు పాతిక వరకు వెలువడ్డాయి. 19వ శతాబ్దపు రచయిత్రి ఫ్రెడ్రిక్ బ్రెమెర్ (1801-1865) ప్రభావం సెల్మా రచనల మీద ఎక్కువని విమర్శకుల అభిప్రాయం.

1909లో సెల్మాకు నోబెల్ సాహిత్య పురస్కారం లభించింది. ఈ పురస్కారం అందుకున్న తొలి మహిళ ఆమె. స్వీడన్ నుంచి ఆ బహుమతి పొందిన తొలి మహిళ కూడా. 1911లో గౌరవ డాక్టరేట్ లభించిందామెకు. అలాగే 1914లో స్వీడిష్ అకాడమీకి ఎన్నికయ్యారు. మర్బకాలో సెల్మా పూర్వీకుల ఇల్లు శిథిలావస్థలో ఉందని, అమ్మకానికి పెట్టారని తెలుసుకుని, దానిని ఆ చుట్టుపక్కల కొంతస్థలాన్ని, నోబెల్ బహుమతి మొత్తంతో కొన్నారు సెల్మా.

1911 నుంచి మహిళల సమస్యల మీద, యుద్ధవ్యతిరేక కార్యకలాపాలమీద సెల్మా ఎక్కువగా పనిచేశారు. ప్రతీకాత్మకత, ఆధునికతల స్ఫూర్తితో, కథనాత్మక వచనానికి నూతన సృష్టికర్త అయి,

మొదటి ప్రపంచయుద్ధం సెల్మాను విపరీతంగా కలచివేసింది. ఆ కారణంగా కొన్నాళ్ళు రచనలు చేయడం మానేశారు. 1930లో 'నా బాల్య జ్ఞాపకాలు', 1932లో 'సెల్మా లోగెర్లోఫ్ డైరీ' రచించారు.

ఆధునిక కథారచనలో అత్యంత సహజమైన ప్రతిభావంతురాలు సెల్మా. తమవారిని గురించీ, ఇతరుల గురించీ మనోహరమైన రీతిలో అపురూపమైన కథలు సృజించారు. తొలి నోబెల్ పురస్కారం పొందిన ఈమె రచనలు ఇప్పటికీ దేశదేశాల పాఠకులు ఇష్టంగా చదువుతున్నారు.



ప్రపంచ ప్రసిద్ధి చెందారు. ఆమె రచనలు యాభై కన్నా ఎక్కువ భాషల్లో అనువాదమయ్యాయి. ఆమె రచనల్ని రంగస్థలం, నాటకశాల, చలనచిత్రాలకు అనుకూలంగా మలిచారు. 1917 నుంచి 1922 వరకు ఆమె రచనలు మూకీ చిత్రాలుగా వచ్చాయి. 1920లో మర్బకాలో కొత్త ఇంటిని కట్టుకున్నారు. ఆ ఇల్లు పూర్తి కాకముందే ఎల్కాన్ మరణించింది. అప్పటించి జ్ఞాపకాల్ని రికార్డు చేసుకోవడంలోనే సమయం గడిపిందామె. 1933లో ఎల్కాన్ జ్ఞాపకార్థం తన క్రైస్తవ ప్రాచీన కథల పుస్తకాన్ని అంకితమిచ్చారు. ఆ పుస్తకం మీద వచ్చిన ధనాన్ని నాజీ జర్మనీ మూలంగా కాందిశీకులైన యూదుల కోసం ఖర్చు చేశారు. దాని పర్యవసానంగా జర్మనీ ఆమె పుస్తకాల్ని బహిష్కరించింది. అయితే అదే కాలంలో ఎందరో జర్మనీ మేధావులు నాజీ జర్మనీ నుంచి విముక్తుల్ని చేయడానికి సెల్మా తోడ్పడ్డారు. మరో నోబెల్ బహుమతి గ్రహీత, ప్రసిద్ధ కవయిత్రి నెల్లీ సాచ్స్‌ను, నాజీల నిర్బంధ శిబిరాలకు తరలించకుండా కాపాడారు. ఫిన్లాండ్ మీద సోవియట్ దాడి సందర్భంగా ఫిన్లాండ్ వాసుల సహాయం కోసం 1940లో తన నోబెల్ బంగారు పతకాన్ని దానమివ్వడం గమనార్హం. ఇది ఈ రచయిత్రి వితరణ గుణానికి సంకేతం.

16 మార్చి 1940లో మస్తిష్క రక్తస్రావం మూలంగా సెల్మా లోగెర్లోఫ్ మరణించారు. ఆమె ఇద్దరు భాగస్వాములు సోఫీ ఎల్కాన్, వాల్బోర్గ్ ఓలండర్‌లకు రాసిన ఉత్తరాలు ఆమె మరణించిన యాభై ఏళ్ళ వరకు బహిరంగపర్చలేదు. అవి సోఫీ ఎల్కాన్‌తో దగ్గరితనం మీద అనేక ఆసక్తికరమైన వ్యక్తిగత విషయాల్ని తెలియజేస్తాయి.

స్త్రీల హక్కుల ఉద్యమం, రాజకీయాల్లో ఆసక్తితోపాటు, శాంతి సందేశ స్వరంగా కూడా సెల్మా జీవితాంతం పనిచేశారు. అప్పటివరకు రాజ్యమేలిన నిరాశాపూరిత వాస్తవికతను కాదని, కాల్పనిక సాహిత్యం, మాయా (మాంత్రిక) వాస్తవికత, పిల్లల సాహిత్యంలో సైతం విశేషమైన ప్రతిభాపాటవాలు కనబరిచారు. ఆధునిక కథారచనలో అత్యంత సహజమైన ప్రతిభావంతురాలు సెల్మా. తమవారిని గురించీ, ఇతరుల గురించీ మనోహరమైన రీతిలో అపురూపమైన కథలు సృజించారు. తొలి నోబెల్ పురస్కారం పొందిన ఈమె రచనలు ఇప్పటికీ దేశదేశాల పాఠకులు ఇష్టంగా చదువుతున్నారు. ఇది ఆమె సృజనాత్మక ప్రతిభకు ఈతరం పాఠకులు అందిస్తున్న సత్కారంగా భావించాలి.

రచయిత సెల్: 99083 47273

■ నవరాగం

ఏకాంత మందిరం ఎలా ఉండాలి?

జీవితాన్ని జీవించడం వాయిదా వేస్తే జీవితానికి అర్థం లేదు. సహజాతాల్ని అస్సలు వాయిదా వేయకూడదు. ఆకలేస్తే అన్నం తినడమంత సహజంగా, దాహమేస్తే మంచినీళ్ళు తాగినంత సహజంగా దేహవాంఛల్ని తీర్చుకోవడం సాధ్యమా? ఎందుకంటే ఇది కూడా ఓ సహజాతం. అయితే మంచినీళ్ళు తాగినంత సులువు కాదు. మనసులు కలవాలి. ప్రేమ కలగాలి. మరీ ముఖ్యంగా ఇద్దరు స్త్రీ పురుషుల మనో వాంఛితమై ఉండాలి. దీనికి సమాజం నిర్దేశించిన విధినిషేధాల మాట ఎలా వున్నా ఎవరితో జత కట్టాలన్నా నిర్ణయం ఆ వ్యక్తులదే. ఇద్దరి అంగీకారమే వైవాహిక జీవితానికి దారితీస్తుంది. తదనంతరం జీవితం

ఆశించినరీతిలో వుండాలంటే మీదయిన ఏకాంతమందిరం మీకు ఉండాలి.

ఏ వయసులో జరగాల్సిన ముచ్చట ఆ వయసులో జరగాలని పెద్దలు అంటారు. అందుకే మేను మేను కలవాలన్న తపనలతో ముడిపడిన సహజాతానికి అంత ప్రాధాన్యం వుంది. దీనిని సవ్యంగా తీర్చుకోవడంలోనే బతుకు నవనవోన్మేషంగావుంటుంది. వున్నంతలో జీవితాన్ని రాగరంజితం చేసుకోవాలంటే భార్యాభర్తల మధ్యన అవగాహన వుండాలి. తమ శృంగార జీవితం ఎలా వుండాలో నిర్ణయించుకోవాలి.

జీవితం సినిమాల్లో మాదిరిగా వుండదు. వాణిజ్యప్రకటనల్లో చూపించేంత సుందరంగానూ ఉండదు. అయినప్పటికీ వున్నంతలో తమదైన ఏకాంత మందిరాన్ని తమకు నచ్చినరీతిలో మలుచుకుంటే ఆ జీవితం అత్యంత రసాత్మకం. పరిస్థితుల్ని, పరిసరాల్ని ఎలా మలుచుకుంటారన్నది వారి వారి ఆలోచనా ధోరణి నిర్ణయిస్తుంది.

★ కొత్తలో తెలియకపోవచ్చు. కానీ క్రమంగా భార్యాభర్తలకు ఒకరి దేహభాష మరొకరికి అర్థమవుతుంది. ఒకరి వాంఛలు మరొకరికి తెలుస్తుంటాయి. తెలియకపోతే తెలుసుకోవాలి. తెలుసుకోడానికి ప్రయత్నించాలి. అందుకు అనుగుణంగా స్పందించాలి.

★ శృంగారం ఎవరికయినా ఒక్కటే. కానీ వారిదే అయిన ఒక ప్రత్యేకభాష వుంటుంది. ఏకాంతంలో ఇష్టంగా మాట్లాడే భాషలో మరింత అందం ఇమిడివుంటుంది. పిలుపులోనే అనురాగం పల్లవిస్తుంది. ఇలాంటి అభివ్యక్తిని, భాషని క్రమంగా సంతరించుకోవాలి. అది తామిద్దరికి మాత్రమే పరిమితమైన సృజనాత్మక భాష కావాలి. సన్నిహితంగా మెలిగే వేళ అది వారి ఆనందాన్ని రెట్టింపు చేస్తుంది.

★ అన్నిటికీ మించి తమకే ప్రత్యేకమైన పడకగదిని వున్నంతలో అందంగా అలంకరించుకోవాలి. బయటివాళ్ళకు కనిపించకుండా వుండాలి. కొన్ని ఫ్లాట్స్‌లో పడకగది హాల్‌లో కూర్చున్నవారికి కనిపించేలా వుంటుంది. అదేమంత శోభనివ్వదు. మీకే ప్రత్యేకమైన శయనమందిరం మరొకరి కంట పడటం తగదు.

★ మిత్రులనయినా, అతిథులనైనా సరే పడకగదిలోకి రానివ్వకూడదు. పడక మీద కూర్చోనివ్వకూడదు. వచ్చిన బంధువులు మీ పడక మీద విశ్రమించే అవకాశం ఇవ్వకూడదు. ఎందుకంటే అది మీకు మీరు సృజించుకున్న శయనమందిరం. మీ సరాగాల రసోద్వేగ నివాసం. అందుకే అంత గోప్యత. అంత ప్రత్యేకత.

★ పడకగది స్టోర్ రూమ్ కాదు. మంచాల కింద పాతసామాన్లు, పనికిరాని వస్తువులు పడకగదిలోనే వుంచుతారు చాలామంది. ఇది రసాత్మకమైన ఆలోచనలకు భంగకరం. అందుకని వీలయినంత సౌకర్యవంతంగా అలంకరించుకోవాలి. మీ మనసు మెచ్చే పెయింటింగ్స్ ఆ గదిలో వుండాలి. మనసుకు మెచ్చే కవిత్వం పుస్తకాలు ఉండాలి. అగరు పొగల పరిమళాలు పరివ్యాప్తమై రాత్రిని రాగరంజితం చేయాలి.

★ భార్యాభర్తలు పడకగదిలో వాడే దిండ్లు, దుప్పట్లు, చద్దర్లు, వారికే ప్రత్యేకం. వాటిని ఎంత శుభ్రంగా వుంచుకుంటే అంత మంచిది. వాటి ఎంపికలో సొగసుదనం కనబరచాలి. మనసుకింపైన బెడ్‌షీట్స్‌ను ఎంచుకోవాలి. కనీసం వారానికోసారి మార్చాలి. వీకెండ్స్‌లో పడకగదిని వైవిధ్యంగా అలంకరించుకోగలిగితే మరీ మంచిది. ప్రతి వీకెండ్ ఒక ప్రత్యేకమైన అనుభూతి సాంద్రతను అందించాలి.

★ పిల్లల కోసం పడకగదిని త్యాగం చేయకూడదు. వారిని చిన్నప్పట్నించి వేరే గదిలో నిద్రపుచ్చే అలవాటు చేయాలి. చాలా ఇళ్ళలో ఇద్దరు పిల్లలు, భార్యాభర్తలు పక్కపక్కన పడుకుంటారు. ఇక ఏకాంతం ఎక్కడ? వాంఛలు తీరే మార్గం ఎక్కడ? రాత్రులు రాగ రంజితమయ్యేదెలా? అందుకని మీ ఏకాంత మందిరం పిల్లల బెడ్‌రూమ్ కాకూడదు. మీకు మాత్రమే ప్రత్యేకంగా వుండాలి.

★ ఏకాంతమందిరంలో ఫిర్యాదులకీ, కోపాలకీ తాపాలకీ తావు లేదు. ఒకవేళ వున్నా అవి మీ సహజాతానికి సంబంధించినవయితే ఫరవాలేదు. ఫిర్యాదులతో కాలాన్ని వృధా పుచ్చకూడదు. మీకు మాత్రమే ప్రత్యేకమైన రాత్రుల్ని మనసా, వాచా, కర్మణా అనుభవించి తరించాలి. ఏకాంతమందిరం వున్నదే అందుకని గుర్తుపెట్టుకోవాలి.

వయసుతో, కాలంతో, పరిస్థితులతో నిమిత్తం లేదు. మీదయిన ఏకాంత మందిరం నిరంతరం మీకే ప్రత్యేకం. సముద్రపు కెరటాల్లా ఎగసిపడే కోర్కెల్ని, మధురోహల్ని అంతే స్వేచ్ఛగా అభివ్యక్తం చేయాలంటే మీదైన ప్రత్యేక రసోద్దీపనల మందిరం మీకు తప్పనిసరి. ఇది కల్పించుకోగలిగిన వారి జీవితం అత్యంత మనోహరం. అలాంటప్పుడే సహజాతాలు సహజసుందరంగా ఫలిస్తాయి. జీవితమే సఫలమూ, రాగసుధాభరితమూ అని పాడుకోవడం సాధ్యం. ఈ రీతిన జీవితాన్ని అనుభవించి, అనుభూతి చెందే స్త్రీ పురుషులు సామాజిక జీవితంలో విజయపథాన సాగిపోతారు.

– ప్రణీత్

మనిషి తనకు కావాల్సిన దేనికోసమో ప్రపంచమంతా అన్వేషిస్తాడు. చివరకు తనకు కావల్సిన దేనినో తన ఇంట్లోనే కనుగొంటాడు.

– జార్జి మూర్

సెల్ఫీలు షేర్ చేస్తున్నారా..?

సోర్స్ కోడ్

కె.ఎక్స్.రాజు

ఇటీవల సోషల్ మీడియాలో ఎక్కువగా వినిపిస్తోన్న పదం... సెల్ఫీ. అతి తక్కువ సమయంలోనే ఈ సెల్ఫీ పెద్ద న్యూస్‌గా మారిపోయింది. ఈ పదం కొత్తగా అనిపించవచ్చు కానీ ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా మొత్తం చిన్నా, పెద్ద, యువత సెల్ఫీ మోజులో మునిగి తేలుతున్నారు. స్మార్ట్‌ఫోన్‌లు, సోషల్ మీడియా పుణ్యమా అని ఈ సంస్కృతి మరింత శరవేగంగా పుంజుకుంటోంది. కెమెరా ఫోన్‌లు అందుబాటులోకి వచ్చిన తరువాత చాలా మంది తమను తామే ఫోటో తీసుకోవడం, ఆ ఫోటోను సోషల్ మీడియాలో పోస్ట్ చేయటం అనే పద్ధతి బాగా ప్రాచుర్యంలోకి వచ్చింది. ఈ వ్యక్తీకరణ విధానాన్ని ఆంగ్లంలో సెల్ఫీ అంటున్నారు. సెల్ఫీ అనే మాటని ఆక్స్‌ఫర్డ్ ఇంగ్లీష్ డిక్షనరీ ప్రచురణ కర్తలు 2013 వర్డ్ ఆఫ్ ది ఇయర్‌గా ఎంపిక చేశారు. సెల్ఫీ అంటే... డిజిటల్ కెమెరాతోగానీ, కెమెరా ఫోన్‌తో గానీ మనకుమనం తీసుకున్న సెల్ఫ్ పోర్ట్రెయిట్ ఫోటోగ్రాఫ్ అనే అర్థాన్నిచ్చారు. సింపుల్‌గా మన ఫోటోలను మనమే తీసుకోడాన్ని సెల్ఫీ

ఒకప్పుడు ఫోటోలు దిగాలంటే మరొకరి సాయం తప్పనిసరి. ఇప్పుడు స్మార్ట్‌ఫోన్లు వచ్చాక ప్రతి ఒక్కరూ కెమెరామెన్ అయిపోతున్నారు. ఎవరికి వారే 'సెల్ఫీ'లు తీసేసుకుని, సోషల్ నెట్‌వర్కింగ్ సైట్లలో పెట్టేస్తున్నారు.

అంటారు.

ఫేస్‌బుక్, ట్విట్టర్, గూగుల్ ప్లస్, ఇన్‌స్టాగ్రామ్ వంటి సోషల్ నెట్‌వర్కింగ్ సైట్లన్నీ ఒకదానికొకటి పోటీపడి మరీ ఈ సేవలను అందిస్తున్నాయి. తమ అభిరుచులు, అనుభవాలు, ఆనందాలు, విషాదాలను అందరితో పంచుకుని తమను తాము ప్రత్యేకంగా వ్యక్తీకరించుకునేందుకు ఇప్పుడు ఎక్కువమంది ఎంచుకున్న దారి సెల్ఫీ.

ఒకప్పుడు ఫోటోలు దిగాలంటే మరొకరి సాయం తప్పనిసరి. ఇప్పుడు స్మార్ట్‌ఫోన్లు వచ్చాక ప్రతి ఒక్కరూ కెమెరామెన్ అయిపోతున్నారు. ఎవరికి వారే 'సెల్ఫీ'లు తీసేసుకుని, సోషల్ నెట్‌వర్కింగ్ సైట్లలో పెట్టేస్తున్నారు. మరీ ముఖ్యంగా సెలెబ్రిటీలకు ఇదో సరదా అయిపోయింది. ఎలాబడితే అలా సెల్ఫీలు తీసుకుంటూ తమ స్నేహితులకు చూపించుకుని సంబర పడిపోతుంటారు. మరికొందరు మామూలుగా జ్ఞాపకాల కోసం ప్రత్యేకంగా తీసుకుంటారు. అది సెలబ్రిటీలకే పరిమితం కాలేదు. స్మార్ట్‌ఫోన్ వున్న ప్రతిఒక్కరూ ఈ పద్ధతి అనుకరిస్తున్నారు. దీంతో ఫొటోషూట్స్‌లా కనిపించిన సోషల్ వెబ్‌సైట్లు ఇప్పుడు సెల్ఫీ ఫొటోలతో వినూత్నంగా దర్శనమిస్తున్నాయి. వింత అనుభూతులను కలిగిస్తున్నాయి. బైక్‌పై వెళ్లేటప్పుడు, పడుకునేటప్పుడు, తినేటప్పుడు, విహార యాత్రలకు వెళ్ళేటప్పుడు.... ఇలా ఎవరి స్టైల్‌లో వారు అప్పటికప్పుడు సెల్ఫీ ఫోటోలు తీసి సోషల్ మీడియాలో పెట్టేస్తున్నారు. ఇటీవల వచ్చిన "మనం" సినిమాలో హీరో హీరోయిన్లు ఒక ట్రాఫిక్ జంక్షన్‌లో ఆగినప్పుడు పక్కనే వున్న క్లాక్ టవర్ కనిపించే విధంగా బండిమీద కూర్చునే ఫొటో తీసుకుంటారు. ఇలాంటి సన్నివేశాలు యువతరాన్ని చాలా త్వరగా ఆకర్షిస్తాయి. ఆ తరహా ఫొటోలను కూడా ఇప్పుడు ఫేస్‌బుక్ లాంటి సైట్లలో చూస్తున్నాము.

సెల్ఫీలపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఎక్కువగా సెల్ఫీలను షేర్ చేయడం వల్ల స్నేహితులు, బంధువులతో సన్నిహిత సంబంధాలు దెబ్బతింటాయని తాజాగా ఓ సర్వే వెల్లడించింది. బ్రిటిష్ పరిశోధకులు నిర్వహించిన ఈ సర్వే ప్రకారం... స్నేహితులతో తీసుకున్న సెల్ఫీలను ఎక్కువగా షేర్ చేస్తుండడం వల్ల భాగస్వామితో సంబంధాలు దెబ్బతింటాయని, స్నేహితుల నుంచీ లైక్స్ తగ్గుతాయని, పైగా సొంత ఫొటోలను ఎక్కువగా పెట్టుకునేవారిపట్ల చూసేవారికి నెగెటివ్ దృక్పథం ఏర్పడుతుందని ఆ సర్వే వెల్లడించింది. ఇదొక భాగమైతే, సెల్ఫీల వల్ల అనేక అనర్థాలు కూడా జరుగుతున్నాయి.

తమ జ్ఞాపకాలను పదిలపర్చుకోవడం కోసం ఫొటోలు తీసుకోవడం,

తీయించుకోవడం వరకూ తప్పులేదు. కానీ మరీ దుస్సాహసాలు చేస్తూ సెల్ఫీలు తీసుకుంటే మాత్రం ప్రాణాలు బలైపోతాయని మెక్సికోలో జరిగిన ఈ తాజా సంఘటన రుజువు చేస్తోంది. 'మెక్సికన్ వెటర్నరీ డాక్టర్ అస్కార్ ఒటిరో అందిరిలాగే సెల్ఫీలు తీసుకుంటూ సరదాగా కాలం గడిపేవాడు. అందమైన అమ్మాయిల్ని కౌగిలించుకుంటూ, మోటార్ బైక్స్‌పై విన్యాసాలు చేసుకుంటూ, రకరకాల విన్యాసాలతో నిత్యం సెల్ఫీలు తీసుకునేవాడు. ఈ నేపథ్యంలో బుల్లెట్లతో ఫుల్‌గా లోడెడ్ అయి వున్న ఒక తుపాకీని తలకు దగ్గరగా పెట్టుకుని ఫొటో దిగాలని సరదాపడ్డాడు. అయితే సెల్ఫీ తీసుకునే సరదాలో ఆ తుపాకీలో బుల్లెట్లు వున్నాయన్న సంగతిని మర్చిపోయి దానిని నొక్కేశాడు. ఇంకేముంది... బుల్లెట్ నేరుగా అతని తల్లోకి దూసుకుపోయింది. ఆసుపత్రికి తరలించేలోపే అతను ప్రాణాలు కోల్పోయాడు. చిన్న చిన్న సాహసాలు సరదాగానే వుంటాయి కానీ, మరీ ఇలా ప్రాణాల మీదకు తెచ్చే దుస్సాహసాలు మంచిది కాదు.

సోషల్ నెట్‌వర్కింగ్ సైట్లలో ఎక్కువగా సెల్ఫీలను షేర్ చేస్తున్నారా? అయితే కాస్త ఆలోచించుకోండి. మన సరదా ఇతరులను ఇబ్బంది పెట్టేదిగా కానీ, మన ప్రాణాల మీదకు తెచ్చేదిగా కానీ వుండకూడదు.

రచయిత సెల్ : 9490099219

అందుకున్నాం



అణుజ్వాల
డా॥కె.కిరణ్ కుమార్
వెల : 70/-,
పేజీలు : 147
ప్రతులకు :
అన్ని ప్రముఖ పుస్తక
విక్రయ కేంద్రాలు

చిటపట చినుకులు
చిన్ని కవితలు
వకుళాభరణం
జగన్మోహనరావు
వెల : 60/-, పేజీలు : 44
ప్రతులకు :
రాష్ట్రంలోని అన్ని ప్రముఖ
పుస్తక విక్రయ కేంద్రాలు



సోనకాలువల
అపూర్వ పురాగాథ
డా॥ లెనిన్ ధనిశెట్టి
వెల : 20/-, పేజీలు : 35
ప్రతులకు :
అనంతుడు ఫౌండేషన్స్
కొండ గడప, మోత్కూరు,
నల్గొండ, తెలంగాణ



స్టాక్ మార్కెట్
వ్యూహాలు, యుక్తులు
డా॥కె.కిరణ్‌కుమార్
వెల : 100/-,
పేజీలు : 149
ప్రతులకు :
అన్ని ప్రముఖ పుస్తక
విక్రయ కేంద్రాలు



స్టాక్ మార్కెట్‌లో
మంచి షేర్లను ఎన్నుకోవడం ఎలా?
డా॥కె.కిరణ్‌కుమార్
వెల : 75/-,
పేజీలు : 115
ప్రతులకు :
అన్ని ప్రముఖ పుస్తక
విక్రయ కేంద్రాలు

■ **సమీక్షలు**

ఆచరణాత్మకమైన ప్రయోగం



శాంతివనం (పిల్లల అనుభవాలు-ప్రయోగాలు)
రచన, కూర్పు, సంపాదకత్వం: మంచికంటి, పేజీలు: 248,
వెల: రూ. 200. ప్రతులకు: మంచికంటి, శాంతివనం,
పదమటి నాయుడుపాలెం, చీమకుర్తి (పోస్టు)-523 226, ప్రకాశం

పిల్లల పట్ల ప్రేమతో, తపనతో ఇష్టంగా ప్రముఖ రచయిత మంచికంటి చేసిన ప్రయోగాల, రాసిన వ్యాసాల సమాహారం 'శాంతివనం'. ఒంగోలులో ఉపాధ్యాయునిగా పనిచేస్తున్న మంచికంటి వెంకటేశ్వరరెడ్డి కవి, రచయిత, సామాజిక చైతన్యంతో పలు ఉద్యమాల్లో భాగస్వామిగా వున్నారు. ఒంగోలుకు దగ్గరలోని నాయుడుపాలెంలో ఈ 'శాంతివనం' విద్యాలయం వుంది. దానిని కేంద్రంగా చేసుకొని భవిష్యత్తరాల వారికి మార్గదర్శకంగా వుండే పనులు చేపట్టారు మంచికంటి. ఆ అనుభవాల్ని ఈ పుస్తకంలో రూపొందించారు. మరీ ముఖ్యంగా పిల్లల మనోభావాల్ని, అనుభవాల్ని వారి చేతనే రాయించి ఈవిధంగా సంకలనం చేయడం మెచ్చదగింది. పిల్లల్లోని ఊహాశాలిత, సృజనాత్మకత, కొత్త ఆలోచనల పుట్టుక ఎలా వుంటుందో తెలుసుకోడానికి ఉపకరించే పుస్తకమిది. పిల్లల మనసు మెచ్చేలా చదువుల విధానం ఎలా వుండాలో తన అనుభవ నేపథ్యం నుంచి వివరించారు మంచికంటి. అలాగే గిజుభాయి, జిడ్డు కృష్ణమూర్తి విద్యకు సంబంధించి వ్యక్తం చేసిన తాత్వికభావాల్ని ఆచరణలో ఎలా పెట్టవచ్చో తన కార్యాచరణ ద్వారా నిరూపించారు. ఈవిధంగా 'శాంతివనం' ద్వారా మంచికంటి అందిస్తున్న అనుభవాల సారం ఈ పుస్తకం. దీనిని చదివి చర్చించడం విద్యారంగంలో వున్నవారి కర్తవ్యం.

ఉద్యమ సాహిత్య విశ్లేషణ

యుద్ధవచనం (ఉద్యమ సాహిత్య వ్యాసాలు)
రచన: జూలూరు గౌరీశంకర్
పేజీలు: 188, వెల: రూ. 180
ప్రతులకు: ప్రముఖ పుస్తక కేంద్రాలు

ఏ ఉద్యమంలోనైనా సాహిత్యకారులు నిర్వహించే కర్తవ్యాలు చరిత్రను మలుపు తిప్పుతాయి. కొత్తచరిత్రను సృష్టిస్తాయి. తెలంగాణ సాధన ఉద్యమంలో పదిహేనేళ్ళుగా రచయితలు, కవులు వివిధ దశల్లో బహుముఖపాత్రని పోషించారు. ఆ క్రమంలో వారు చేసిన సాహిత్యరచనలపై జూలూరు గౌరీశంకర్ రాసిన పలు వ్యాసాల సంపుటి 'యుద్ధవచనం'. 'తెలంగాణ మట్టిలో ఏదో మహత్తరశక్తి వుంది' అనే ఉద్వేగంతో రచనలు చేయడం గౌరీశంకర్ స్వభావం. అందుకు తగ్గట్టుగానే ఈ పుస్తకంలోని వ్యాసాలున్నాయి. తెలంగాణ నుంచి వచ్చిన దీర్ఘకవితలు, కవితల సంపుటాలు, సంకలనాలు, విభిన్న సందర్భాల్లో తెలంగాణ కవుల సామూహిక స్పందనలపై గౌరీశంకర్ ప్రతిస్పందనలుగా ఈ వ్యాసాలు వెలువడ్డాయి. అలాగే కాళోజీ, జయశంకర్ వంటి వారి గురించి, పాట పోషించిన పాత్ర గురించి విశ్లేషణాత్మకమైన వ్యాసాలున్నాయి. ఉద్యమక్రమాన తెలంగాణ ప్రాంతం నుంచి వచ్చిన సాహిత్యం ఎలాంటి పాత్రని పోషించిందో ఈ వ్యాసాలు చెబుతాయి. రాచపాళెం చంద్రశేఖరరెడ్డి, కోయి కోటేశ్వరరావు, ఎ.కె.ప్రభాకర్‌ల ముందుమాటలు ఈ వ్యాసాల ప్రత్యేకతను తెలియజేస్తాయి. గత పదిహేనేళ్ళ కాలంలోని సాహిత్యరంగ పరిణామాల్ని అర్థం చేసుకోడానికి ఈ పుస్తకం ఉపకరిస్తుంది.

- ఎస్.దుర్గాప్రసాద్

దివ్యత్వాన్ని జాగృతం చేసే అక్షరాలు

విశ్వగీతం (కవిత్వం) , రచన: కె.లక్ష్మణ్‌గౌడ్
పేజీలు: 64, వెల: రూ. 50. ప్రతులకు: కె. లక్ష్మణ్ గౌడ్, 8-3-22/1, టీచర్స్ కాలనీ , మహబూబ్‌నగర్-509 001, ఫోను: 93921 40465

"నేను అనుభవించిన స్పందనల్ని అక్షరబద్ధం చేసి నా అత్యల్ప పరిధిలోని ఆలోచనల్ని మీ ముందుంచే ప్రయత్నం చేశాను" అని 'విశ్వగీతం' పుస్తకం వెలువరిస్తూ ముందుమాటలో వినమ్రంగా చెప్పారు కవి కె.లక్ష్మణ్‌గౌడ్. నిజానికి అనేక అంశాల పట్ల స్పష్టమైన అవగాహనతో ఆయన కవిత్వం రాశారు. "రాగద్వేషాల కతీతంగా విశ్వరసమయ విహంగం కావాలి/ మానవ మేధస్సు చీకటి గుహల్ని తేజోమయం చేయాలి" అని ఆకాంక్షించారు. ఈ పుస్తకంలోని 32 కవితలు పాఠకుల మనో చైతన్యాన్ని విస్తరింపజేస్తాయి. కొత్త ఆలోచనలకు తావునిస్తాయి. మనిషిలోని దివ్యత్వాన్ని జాగృతం చేయడానికి లక్ష్మణ్‌గౌడ్ అక్షరాలు సానబడుతున్నడని ముందుమాట రాసిన నందిని సిధారెడ్డి అన్నమాటలు అక్షరసత్యం. అందుకని వారి కవితా వ్యాసంగం ఇంకా విస్తృతం కావాలి. భీంపల్లి శ్రీకాంత్ అన్నట్టు సమాజాన్ని కుటుంబంగా భావించే కరుణామూర్తి లక్ష్మణ్‌గౌడ్ అని ఈ కవిత్వం చదివితే అర్థమవుతుంది. 'గురువు' గురించి వారు రాసిన కవిత ప్రతి విద్యార్థి చదవాలి. ప్రతి ఉపాధ్యాయుడు సదా మననం చేయాలి. ఈ కవిత వారి తాత్విక స్వభావానికి తార్కాణంగా నిలిచింది.

హాస్యాన్ని పండించిన కథలు

నా కొక శ్రీమతి కావాలి (హాస్యకథలు)
రచన: డా. మంతెన సూర్యనారాయణ రాజు
పేజీలు: 136, వెల: రూ. 120.
ప్రతులకు: విశాలాంధ్ర పుస్తక కేంద్రాలు

సునిశితమైన హాస్యాన్ని రాయడం ఎలానో డాక్టర్ మంతెన సూర్యనారాయణ రాజు గారికి బాగా తెలుసు. వారి కథల పుస్తకం 'నా కొక శ్రీమతి కావాలి' చదివితే ఈ విషయం బోధపడుతుంది. ప్రతి కథలోనూ హాస్యం, వ్యంగ్యం సమపాళ్ళలో వున్నాయి. దైనందిన జీవితంలో హాస్యం మనిషి ఆరోగ్యానికి అవసరం. హాయిగా నవ్వుకోడానికి ఉపకరించే కథలు ఈ పుస్తకంలో వున్నాయి. 24 కథలున్న పుస్తకమిది. వర్తమాన సమాజంలోని సంఘటనలెన్నో ఈ కథల్లో దర్శనమిస్తాయి. పాత్రల పేర్లలో, సంభాషణల్లో, వర్ణనల్లో హాస్యం ఉట్టిపడేలా చేయడంలో రచయిత సఫలీకృతులయ్యారు.

- శశాంక

గమనిక

- సమీక్షకోసం పుస్తకాలు పంపే రచయితలు, ప్రచురణ కర్తలు రెండు ప్రతులు పంపించాలి.
- రచయితలే సమీక్షలు రాయించి పంపకూడదు.
- పుస్తకాల మీద సమీక్షలకు సంబంధించి సంపాదకులదే తుది నిర్ణయం. ఈ అంశంపై ఉత్తర ప్రత్యుత్తరాలకు, ఫోన్లలో సంప్రదింపులకు తావు లేదు.

చిరునామా: సోపతి, ప్రజాశక్తి ఆదివారం సంచిక, ప్లాట్ నెం.21/1,
ఎం.హెచ్.భవన్, ఆజామాబాద్, ఇండస్ట్రియల్ ఏరియా,
బాగ్‌లింగంపల్లి, హైదరాబాద్-500030.

నాకు నచ్చిన పుస్తకం

ఒక యోగి ప్రస్థానం



వ్యక్తిత్వ వికాస పుస్తకాలు చదవడం నాకు ఇష్టం. మంచి మంచి కొటేషన్లు, ప్రముఖుల జీవిత అనుభవాలు ఉటంకిస్తూ రాస్తుంటారు. ఈమధ్యన రాబిన్‌శర్మ రాసిన రెండు పుస్తకాలు చదివాను. ఇంగ్లీషులో ఆయన రాసిన పుస్తకాలు ఇప్పుడు తెలుగులో రావడం మన అదృష్టం. 'ఆస్తులు అమ్ముకుని ఆత్మశోధనకై ఒక యోగి ప్రస్థానం' శీర్షికన వచ్చిన రాబిన్‌శర్మ పుస్తకం ఈమధ్యన చదివా. బాగా నచ్చిన వాక్యాల కింద పెన్సిల్ గీయడం నాకు అలవాటు. కానీ ఈ పుస్తకంలో ప్రతి వాక్యం కూడా అండర్‌లైన్ చేయదగిందే. మళ్ళీ మళ్ళీ చదవాల్సిందే. ఒకటీత రెండు అధ్యాయాలు చదివేసరికి అండర్‌లైన్ చేసిన వాక్యాలే ఎక్కువశాతం వున్నాయి. స్ఫూర్తిదాయకమైన కొటేషన్స్, ప్రముఖుల అనుభవాలు ఉదాహరిస్తూ రాబిన్‌శర్మ రాసిన ఈ పుస్తకం నవలలా చదివిస్తుంది. నిజమనిపించేలా అనేక ఊహల్ని వాస్తవికంగా రాయడం ఆయన పద్ధతి. ఒక్కొక్క వాక్యం ఒక్కొక్క కొటేషన్‌లా అనిపిస్తుంది. మనం ఎలా జీవిస్తున్నామో మనకు తెలియజేస్తారు. మన జీవితంలో మనం మార్పులు చేసుకోవాలన్న ప్రేరణ కలిగిస్తారు.

ఎన్నో విషయాల్లో మనల్ని ఆలోచనల్లో పడేస్తారు. మన జ్ఞాపకాల్లోకి తీసుకెళతారు. మనం ఎక్కడ పొరపాటు చేసామో గుర్తు చేసేలా రాస్తారు. కాలం ఎంతో విలువైనదని చెబుతారు. గడిచిపోయిన కాలం గురించి చింతించకుండా ముందున్న కాలాన్ని అయినా సద్వినియోగం చేసుకోండని సూచిస్తారు. ఇలాంటి పుస్తకం ఒక పదేళ్ళ కిందట దొరికివుంటే ఎంత బావుండనని ప్రతి పాఠకుడు తలపోసేలా రాశారు. అందుకే ఈ పుస్తకంలో కొన్ని పేజీలయినా ప్రతిరోజు చదువుతున్నా. రాబిన్‌శర్మ రాసిన పుస్తకాలన్నీ చదవాలనిపిస్తుంది, దీనిని చదివాక.

- శ్రీనివాస్, హైదరాబాద్

■ ఈ వారం కవిత్వం

ఆ-యమ్మ కోసం

చిత్తలూరి సత్యనారాయణ

బండెడు చాకిరీ
కుక్కపిల్లయి
తోక ముడుస్తుంది
ఆ-యమ్మ దగ్గర!

ఎంగిలి ప్లేట్లూ
గ్లాసులేనే కాదు
ఎకిలి చూపుల్నీ
ఎర్రి కూతల్నీ
కడిగి పారేస్తుంది!

తల్లో నాలుక
ఏమో గానీ
బళ్లో నాలుక
ఆ-యమ్మే...!

ఒక్క రోజు
ఆ-యమ్మ రాకుంటే
ఈ అమ్మ పని ఔటే!



అమ్మ గొప్పేముంది
తన పిల్లల చాకిరే...
ఆ-యమ్మను చూడండి...!

సెల్ : 991236673

అన్నిటినీ దాటి పోదాం

ఆశారాజు

ఇక్కన్నుంచి వెళ్లిపోదాం
ఈ ఇల్లు వదలీ ఊరు వదలీ
నదులు వదలీ కాలిబాటలు వదలీ
ఎక్కడికైనా దూరంగా వెళదాం!

అడవులు దాటి ఎడారులు దాటి
సముద్రాలు దాటి పర్వతాలు దాటి
పలకరింపు వినిపించే దాకా
పులకింత కోసం పరుగెడుదాం!

ఊరులాంటి ఊరు చేరేదాకా
ఇల్లులాంటి ఇల్లు కనిపించే దాకా
మనుషుల్లా మిగిలిన
మనుషుల్లో కలిసేదాకా
జలపాతాలు దాటుదాం!
తుఫాన్లు దాటుదాం!
ఎండలు దాటుదాం
మంటలు దాటుదాం!

మనం పిలిస్తే ఆగి చూసే వాళ్ల కోసం
మనం ఆగితే ఆదరించే వాళ్ల కోసం
మనల్ని గుర్తుపట్టే వాళ్లు కలిసేదాకా
చెట్టు కిందో, ఏ రాయి పక్క నీడలోనో
సద్దిమూట విప్పి కలిసి తినేదాకా
ఈ పొలిమేరలు దాటిపోదాం!
అసలు మనిషి వున్నాడో లేడో
భూగోళమంతా తిరుగుదాం!
మనం మనుషులమో కాదో
పరీక్షించుకొందాం!
అందర్నీ కలవడానికి
అన్నిటినీ దాటిపోదాం!

సెల్ : 9392302245

శ్రీ మహా పోచమ్మ దేవస్థానము

గ్రా॥ అడెల్లి, మం॥ సారంగాపూర్, జిల్లా ॥ ఆదిలాబాద్

శ్రీ మహా పోచమ్మ వారి గంగనీళ్ల జాతర మహోత్సవం

తేది: 27-09-2014 నుండి 28-09-2014

- తేది : 27-09-2014 శనివారము రోజున ఉదయం 11-00 గంటలకు శ్రీ మహా పోచమ్మ వారి ఆభరణాలతో సేవాదారులు గోదావరికి బయలు దేరడం.
- తేది : 28-09-2014 ఆదివారము గోదావరిలో అమ్మవారి ఆభరములు శుభ్రం చేసుకొని వారు తెచ్చిన గంగనీళ్లతో శ్రీ అమ్మవారికి అభిషేకం (పవిత్రోత్సవం) నిర్వహించబడును.

కావున భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని శ్రీ అమ్మవారిని దర్శించి తీర్థప్రసాదములు స్వీకరించి తరించగలరని కోరుచున్నాము

శ్రీ గుమ్మల రవి చైర్మన్

ధర్మకర్తలు :

యస్. రాజేశ్వర్ రావు, ఆర్. సాయమ్మ, డా॥ యస్. గోవర్ధన్ రెడ్డి, యం. బ్రహ్మాయ్య, డి. సాయన్న, డి. లింగన్న, సిహెచ్. రాజేశ్వర్ రెడ్డి, బి. రాజన్న, డి. శ్రీనివాస్

డి. నారాయణ
సిబ్బంది మరియు అర్చకులు

గమనిక : నిర్మల్, బైంసా డిపోల నుండి దేవాలయం వరకు ప్రత్యేక బస్సులు నడుపబడును మరియు పోలీసు బందోబస్తు, వైద్య సౌకర్యం నీటి సౌకర్యం ఏర్పాటు చేయనైనది

జీవిత కాలపు అనుబంధం

జైన్ సంస్థ మాత్రమే చేయగల ఒక వాగ్దానం
జైన్ డ్రిప్ వారి విశ్వసనీయమైన విధానం ద్వారా అత్యధిక దిగుబడి

జీవిత భాగస్వామిని ఎంచుకొనడంలో ఎన్ని జాగ్రత్తలు తీసుకుంటామో ఒక బిందుసేద్య విధానాన్ని ఎంచుకునేప్పుడు కూడ అంతే జాగ్రత్త అవసరం. వంశాను క్రమం, కుటుంబ పరపతి మరియు జీవితకాలపు నిబద్ధత రెండిటికి సమానమే. మీరు చూపే అన్ని సలక్షణాలు జైన్‌డ్రిప్‌లో ఉన్నాయి. భారతదేశంలోఅత్యంత ప్రజాదరణ కల్గిన సేద్యపు విధానం జైన్ బిందుసేద్యం. ఎందుకు జైన్ బిందు సేద్యమే ఎన్నుకోవాలి.

- కాశ్మీర్ నుండి కన్యాకుమారి దాకా విస్తృతంగా వాడబడేది జైన్ సూక్ష్మ సేద్య విధానం మాత్రమే.
- 48 విభిన్న పంటలలో 15.2 లక్షల ... జైన్ బిందుసేద్యమే.
- అన్ని పరికరాలు సొంత ఫ్యాక్టరీలలో ... మీ అవసరాలకు పూర్తి పరికరాల్ని రూపొందించి అమర్చగలగడమే కాక విక్రయానంతర సేవలందించే సామర్థ్యం గల కంపెనీ జైన్ మాత్రమే.
- అంతర్జాతీయ ప్రమాణాలు కలిగి యుండి జాతీయ, అంతర్జాతీయ అవార్డులను పొందిన ఏకైకభారతదేశపు బిందుసేద్య విధానం జైన్ బిందు సేద్య విధానం మాత్రమే.
- మీ సేద్యపు నీటి సమస్యలకు సరైన పరిష్కారము. పంట దిగుబడిలో అభివృద్ధి!.
- నీటి వాడుకములో 30-40% పొదుపు!. కూలీ ధరలలో ఆదా!, కరెంటు ఆదా!.
- దేశమంతా మారుమూల ప్రాంతాలకుకూడ విస్తరించిన డీలర్ల నెట్‌వర్క్, మరియు విక్రయానంతర సేవాకేంద్రాలు కలవు. కంపెనీ ప్రతినిధులు మీకు అందుబాటులో ఎల్లవేళల సేవలందించుదురు.

జైన్ ఇరిగేషన్ సిస్టమ్స్ లిమిటెడ్

1-1-782/ బి /5, పార్క్ఎదురుగా, కెనరాబ్యాంక్ దగ్గర,
గాంధీనగర్, హైదరాబాద్- 500 080.
ఫోన్: 040-2761 2593, 2765 4681. 9440797846 /881.
Email: jainhyderabad@jains.com, Website: www.jains.com

జైన్ పైపులు | జైన్ డ్రిప్ | జైన్ పిఇ పైపులు | జైన్ స్ప్రింక్లర్స్ | జైన్ గ్రీన్ హౌస్ | జైన్ టిష్యూకల్చర్ | జైన్ పివిసి సోలార్ పంప్

చరిత్ర సాక్ష్యాలు

ప్రకృతి సహజంగా ఏర్పడినవైనా, లేదా మానవ నిర్మితాలైనా గానీ ఈ ప్రపంచం ఎన్నో అద్భుతాలకు నిలయం. కొన్ని ప్రదేశాలను చూస్తుంటే అప్పటి చరిత్రే కాదు, ఆ కాలంలో ఎలాంటి నాగరికత ఉండేదో కూడా తెలుస్తుంది. పురాతన నాగరికతను తెలుసుకోవాలంటే ఆ ప్రదేశాలకు వెళ్తే గానీ సాధ్యం కాదు. అటువంటి ప్రదేశాలు యథాతథంగా లేకపోయినా వాటి ఆనవాళ్లు మాత్రం నేటికీ కనిపిస్తుంటాయి. వీటిని సందర్శించడానికి ప్రతిరోజూ ప్రపంచం నలుమూలల నుండి ఎంతో మంది వస్తుంటారు. అటువంటివే ఇక్కడున్న కొన్ని చిత్రాలు...

1. కొలొసియం (ఇటలీ- క్రీ.శ. 8వ శతాబ్దం)
2. క్రైస్ట్ ద రెడీమర్ (బ్రెజిల్ - 19వ శతాబ్దం)
3. ఈస్టర్ దీవి (చిలీ)
4. టికల్ (గ్వాటెమాల - క్రీ.పూ. 10వ శతాబ్దం)
5. ఎక్రోపొలిస్ ఆఫ్ ఏథెన్స్ (గ్రీస్- క్రీ.పూ. 6వ శతాబ్దం)
6. స్టోన్‌హెన్జ్ (యునైటెడ్ కింగ్‌డమ్- క్రీ.పూ. 8వ శతాబ్దం)
7. పర్సెపొలిస్ (ఇరాన్ - క్రీ.పూ. 6వ శతాబ్దం)
8. మాచుపిచ్చు (పెరూ -క్రీ.శ. 15 వ శతాబ్దం)
9. పెత్రా (జార్డాన్ - క్రీ.పూ. 5వ శతాబ్దం)
10. పిరమిడ్ ఆఫ్ గిజా (ఈజిప్ట్-క్రీ.పూ.2560-2540)